నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
శుక్రవారం | 08 నవంబర్ 2024 | www.navatelangana.com

తార డిగ్రీ పీజీ కళాశాలలో న్యాయ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల అను సారం తారా డిగ్రీ, పీజీ కళాశాల లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహనా సదస్సును గురువారం నిర్వహిం చారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి బి. రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండా లన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాన్నారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. మంచి చదువులు చదివి ఉన్నత ఎదగాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహా యం అందిస్తామన్నారు. ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యా లయం, సంగారెడ్డిని సంప్రదించాలన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులను అభినందించిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



సౌత్ ఇండియా యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికైన హుస్నా బాద్ కబడ్డీ క్లబ్ క్రీడాకారులు గడిపె సిద్ధు, ఎండీ ఆల్ఫాజ్, కోయిలకరి శ్రీశైలంను గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట గ్రంథాల య చైర్మన్ కేడం లింగమూర్తి అభినందించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పేరును కాపాడాలని మంత్రి సూచించారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని కనబరిచేలా కృషి చేస్తున్న కోచ్ మడక కృష్ణను అభినందించారు.

మొక్కలు నాటడంతో పాటు బాధ్యత తీసుకోవాలి

ఐకెపి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఆర్డీఓ శ్రీనివాసరావు



నవతెలంగాణ-చేగుంట

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలనీ డీఆర్డీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం సీఎంఆర్ కాలనీలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలో స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా సమైక్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా సేవకుడు అయిత పరంజ్యోతి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాకెందుకు గుంతలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీఆర్డిఓ శ్రీనివాసరావు హాజరై కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం జిల్లా సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో కలిసి జిల్లా వ్యాప్తంగా సుమారు 1.37 లక్షల మంది మహిళలతో 1,37,000 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. చేగుంట రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 200 కొబ్బరి మొక్కలను నాటుతున్నట్లు ఈ మొక్కల బాధ్యత తీసుకోవాలని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలో నాటుతున్న రెండు వందల మొక్కలను విద్యార్థులు సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అయిత పరంజ్యోతిని ఆయన అభినందించారు. మనము ఈ మొక్కలను మూడు సంవత్సరాలు కాపాడితే పండ్లను అందించడంతో పాటు మన ఆరోగ్యానికి అవసరమయ్యే ఆక్సిజన్ కూడా అందిస్తుందన్నారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. గ్రామాలు పులిమామిడి, కిష్టాపూర్, అనంతసాగర్, ఉల్లి తిమ్మాయిపల్లి, కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాసరావు, అడిషనల్ డీఆర్డీఓ సరస్వతి, డిపిఓ ప్రకాష్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపిఎం లక్ష్మీనరసమ్మ, ఏపీవో శ్వేత, ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి, ప్రిన్సిపల్ సుమతి, నాయకులు జూకోటి రాజు, సీసీలు శ్వేత, రామస్వామి అంజి, స్వామి వివో ఏలు హారిక, సరిత, జ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని పెంచుతా..!

- రూ.2 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన
- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు
- ఇందిరా గాంధీ విగ్రహం పెట్టి కాలని అభివృద్ధి చేస్తాం
- నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని పెంచుతానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. గురువారం హుస్నాబాద్ మున్సిపాలిటీలో 3, 4, 5, 18 వార్డుల్లో ఒక్కో వార్డుకు రూ.50 లక్షల చొప్పున రూ.2 కోట్లతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని, మీ అందరి సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. హుస్నాబాద్‌లో రీడింగ్ రూమ్స్ పేరుతో అన్ని కులాలకు 45 లక్షల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. బుడగ జంగాల కాలనీ వద్ద ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటు చేసి ఆ చౌరస్తాను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బుడగ జంగాల కాలనికి అవసరమైన రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ పట్టణంలో గాంధీ, అంబేద్కర్, నాగారం, కరీంనగర్ చౌరస్తాల అభివృద్ధికి రూ.50 లక్షల చొప్పున కేటాయించుకున్నామన్నారు. ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ.18 కోట్లు టెండర్ అయిందన్నారు. హుస్నాబాద్‌లో పూర్తైన ప్రభుత్వ కార్యాలయాలు, కరీంనగర్ 4 లైన్ల రహదారి, 150 పడకల ఆసుపత్రి, సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం అభివృద్ధి, మహాసముద్రం, ఆర్డీవో ఆఫీస్ స్థలం, స్టేడియం పనులు ఇలా అన్నిటికీ ఒకేసారి ప్రారంభించుకోవడానికి సీఎంను లేదా ఉప ముఖ్యమంత్రిని తీసుకొచ్చి ఫౌండేషన్ వేయాలని కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయడానికి ఇండస్ట్రియల్ ఎండీతో కలిసి చౌటపల్లి వద్ద స్థల పరిశీలన చేశామని, దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ ఏదైనా సలహాలు సూచనలు చేయవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ ఒక రోల్ మోడల్‌గా దేశానికి దిక్సూచిలాగ కుల గణన సర్వే జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కి గ్యాస్ ఇస్తున్నామని ఎవరికైనా రాకపోతే అధికారులను సంప్రదించాలన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి సంబంధించి రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీ పూర్తైందనీ, రూ.2 లక్షల పైన ఉన్న వారికి కుటుంబ నిర్ధారణ పూర్తైంది పైన డబ్బులు చెల్లిస్తే మిగిలినవి మాఫీ అవుతాయని, త్వరలోనే దానికి సంబంధించిన విధి విధానాలు వస్తాయన్నారు. హుస్నాబాద్ పట్టణంలో 2006లో 8 రేషన్ షాపులు ఉంటే 2024లో కూడా 8 ఉండడం దురదృష్టకరమన్నారు. ఎంత జనాభాకి ఎన్ని రేషన్ షాపులు ఉండాలనే వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ పట్టణంలో కొత్త రేషన్ షాపులు తీసుకొచ్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో ఎల్లమ్మ చెరువు, మున్సిపల్ కార్యాలయం, లైబ్రరీ బిల్డింగ్, ఓవర్ అల్ వర్క్స్ వార్ పుట్టింగ్‌లో పూర్తి చేసి ప్రజలకు మంచి సౌకర్యాలు అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ మంచి సంకల్పంతో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో పగడ్బందీగా చేపట్టామని తెలిపారు. సర్వే కోసం ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్ అధికారులకు వివరాలు పూర్తిగా అందించాలని సూచించారు. జిల్లాలో 2.36 లక్షల ఇండ్లు ఉన్నాయని గ్రామాలు, పట్టణాలలో సర్వే కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించామన్నారు. నవంబర్ చివరి వరకు సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత, సిద్ధిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మండల అధ్యక్షుడు బంక చందు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఆర్‌డీఓ

నవతెలంగాణ-వట్‌పల్లి



మండల పరిధిలోని కేరూర్, బిజిరి పూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓ జంగారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంలో ప్రారంభమైన మదర్ యూనిట్ను పరిశీలించారు. అంతకుముందు ఐకేపీ సిబ్బందితో రివ్యూ మీటింగు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో సిరిపుర వాసి కళా ప్రదర్శన

అభినందించిన గ్రామస్తులు

నవతెలంగాణ-హత్నూర



మండల పరిధిలోని సిరిపుర గ్రామానికి చెందిన ఆగం యాదగిరి (రాజు) రవీంద్ర భారతిలో కళ ప్రద ర్శన నిర్వహించగా.. ఆయన్ను డ్యాన్స్ మాస్టర్ గణేష్ అభినందించడం చాలా సంతోషకరమని గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్ అన్నారు. మారుమూల ప్రాంతాల్లో భజనలు చేస్తూ భక్తిపార్వశం అలవర్చిన యాదగిరి.. రవీంద్ర భారతిలో కళ ప్రదర్శిం చడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాదగిరిని ఘనంగా శాలువా పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకలో పలువురు ముఖ్య నేతలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోరి హద్నూర్ గ్రామా నికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాతంశెట్టి మధుసూదన్ నూతన గృహప్రవేశ వేడుక బుధవారం అంగ రంగ వైభవంగా జరిగింది. ఈ వేడ ుకకు పలు పార్టీల ముఖ్య నేతల హాజరై.. మధుసూదన్‌కు పలువురు శుభాకా ంక్షలు తెలిపారు. అనంతరం విందును స్వీకరించారు. హాజరైన వారిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ తనయుడు రాకేష్ శేట్కార్, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పిటిసి చంద్రప్ప, సిద్ది లింగయ్య స్వామి, వెంకట్ రెడ్డి, వెంకట్ తదితరులున్నారు.

అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ- సదాశివపేట



అతివేగంతో బైక్‌ను కారు ఢీకొట్టడంతో.. బైక్ పై ఉన్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సదాశివపేట మం డల పరిధిలో గల గొల్లగూడెం చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలుకూరి ఆంజ నేయులు(38) అనే వ్యక్తి ఐకాన్ నిర్వహణ వెంచర్ లో సూపర్వైజర్ గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి సుమారు 8:40 ప్రాంతంలో డ్యూటీ అయిపోగానే తన బైక్‌పై.. అదే వెంచర్‌లో పనిచేస్తున్న శివకుమార్‌తో కలిసి బయల్దేరాడు. గొల్లె గూడెం చౌరస్తా వద్దకు రాగానే ఎంహెచ్ 43 ఏజె 5160 గల కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న శివకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా.. 108 అంబులెన్స్ ద్వారా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం

నవతెలంగాణ-న్యాల్‌కల్






టీఎస్ యూటీఎఫ్ న్యాల్కల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుక న్నారు. న్యాల్‌కల్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల ఆ సంఘం రాష్ట్ర నాయకులు శ్యామ్ ఆధ్వర్యంలో సంఘం జిల్లా కార్యదర్శి సమియోద్దీన్, ప్రశాంత్ కుమార్ ఎన్నికలు నిర్వహించారు . మండల అధ్యక్షులుగా వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల కోసం యూటీఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. తమ ఎన్నికకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా జ్యోతి, యాదయ్య, షేక్ మహబూబ్, సిరాజ్, విట్టల్, యాదయ్య, యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఇంటింటి కుటుంబ సర్వే

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని హద్నూర్, చాల్కి, మూరుజా పూర్, చీకుర్తి, గంగ్వార్, మెటల్‌కుంట, రేజింతల్, ఖలీల్‌పూర్ తదితర గ్రామాల్లో రెండోరోజు ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వే చేపట్టి ఏనుమరేటర్లు, ఉపాధ్యాయులు స్టిక్కర్లు అతికించారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆస్తి వివరాలు దగ్గర ఉంచుకొని పూర్తి సమాచారం ఇవ్వాలని సూపర్వైజర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ సూపర్వైజర్లు గురునాథ్, రాజ్ కుమార్, సర్వే అధికారులు సఫియా సుల్తానా, గ్రామపంచాయతీ అధికారులు కృష్ణ ప్రతాప్ రెడ్డి, వివేక్, ధనరాజ్, అశోక్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కారు అదుపు తప్పి చెట్టును ఢీకొని ప్రిన్సిపాల్ మృతి

నవతెలంగాణ-మునిపల్లి



కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మృతి చెందిన సంఘటన బుదేరా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల వద్ద జరిగింది. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీలం అర్చన బుధవారం సాయంత్రం తన తోటి ఉద్యోగులతో కలిసి కళాశాల ప్రాంగణంలోని నివాసగృహాల సముదాయాల వైపు ఆల్టో కారులో వెళ్తున్నది. ఈ క్రమంలో కారు అదుపు తప్పి అక్కడ ఒక చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మలక్ పేట్ వాస్తవ్యురాలైన సీలంగారి అర్చన తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మరణించింది. సహచర ఉద్యోగులు అరిఫా తెహాసిన్, వీణ, అకౌంటెంట్ ఫయాజ్ అహ్మద్‌లకు తీవ్ర గాయాలు కావడంతో వారిని సదాశివపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

- స్త్రీనిది ఇన్సెంటివ్ ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు
- ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- జయప్రదం చేయాలని వీవోఏలకు పిలుపు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఐకేపీ వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, స్త్రీనిది ఇన్సెంటివ్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 11, 12 తేదీల్లో చేపట్టనున్న కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వీవోఏలకు పిలుపుని చ్చారు. ఐకేపీ వీవోఏల జిల్లా కమిటీ సమావేశాన్ని గురువా రం సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ.. ఐకెపి వీవోఏలు గత 20ఏండ్ల నుంచి అనేక రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలం దరికీ అందే విధంగా సేవలందిస్తున్నారన్నారు. అయిన ప్పటికీ వారికి మాత్రం కనీస వేతనం, చట్టపరమైన సౌకరా ్యలు అమలు కావడం లేదన్నారు. పోరాటాల సందర్భంగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా.. అమలు చేయడంలో మాత్రం చిత్తశుద్ధి కనబర్చడం లేదన్నారు. గ్రామ సంఘా లకు బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి గ్రామ సంఘానికి ఒక ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ జి.ఓ ప్రకారం గ్రామ సంఘం నుండి రూ.3000 వేతనం ఇవ్వాలని, వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించ ాలన్నారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని, 20 లక్షల బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర సౌకర్యాలు అమలు చేయా లన్నారు. ప్రతి నెల రెగ్యులర్గా వేతనాలు చెల్లించాలని.. ఈనెల 11, 12 తేదీల్లో జరిగే కలెక్టర్ ఆఫీస్ ధర్నాను జిల్లాలోని వీవోఏలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు యం.నగేష్ నాయకులు కాంతమ్మ, అనిత,సుమలత,చంద్రకళ,మల్లయ్య లక్ష్మారెడ్డి, కిష్టయ్య, అన్వర్,భాగ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ సర్కార్..

వట్‌పల్లి ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవంలో

మంత్రి దామోదర్



నవతెలంగాణ-వట్‌పల్లి

అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వమే అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల కేంద్రంలో గురువారం చేపట్టిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅ తిథిగా మంత్రి హాజరయ్యారు. జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ షెట్కర్ కలిసి.. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ఏఎంసీ చైర్మెన్‌గా, ఈశ్వరయ్య వైస్ చైర్మెన్‌గా మిగతావారు డైరెక్ట ర్లుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.152 కోట్లతో నియోజకవర్గంలో రోడ్డు పనులను ప్రారం భిస్తామన్నారు. మరో ఏడున్నర కోట్లతో బోరంచ ఎత్తిపోతల పథకానికి కేటాయి ంచిన నిధులతో చౌదర్పల్లి కొత్వన్పల్లి వరకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయానికి నీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. అల్లాదుర్గం ఐబి నుంచి గంగువార్ చౌరస్తా వరకు 40 కిలోమీటర్ల మేరకు రోడ్డు పనులు చేపట్టేందుకు మరో మూడు నెలల్లో పనులను ప్రారంభిస్తామన్నారు. ఖాదీం ాబాద్, నిర్జప్ల, ఉసిరికపల్లి, గౌతాపూర్, పాల్వాట్ల గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీటిని సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు. మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించామని.. టెండర్ కూడా పూర్తయి పనులను త్వరలోనే ప్రారంబి స్తామన్నారు. జోగిపేట నుంచి డాకుర్, మార్వెల్లి, వట్‌పల్లి వరకు నాలుగు వరసల రోడ్డును విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళా నర్సింగ్ మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ఆరునెలల్లో పూర్తి చేస్తామన్నారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పారదర్శకత ఉండాలన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా స్థలం ఉండి నిర్మించుకునే అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నరు. వట్పల్లిలో వ్యవసాయ మార్కెట్ ప్రహరీ నిర్మాణానికి రాయికోడులో మార్కెట్ గోదాం నిర్మాణానికి నిధులను కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశిప్రభ, పార్టీ మండ లాధ్యక్షు లు రమేష్ జోషి, ఉమ్మడి రేగోడు మాజీ ఎంపీపీ పత్రి విటల్, రాష్ట్ర పీఏసీఎస్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయ వాదులు సంగమేశ్వర్, పీజే విట్టల్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కడుపు క్యాన్సర్‌తో పోరాటం..

ఆపరేషన్‌కు రూ.6లక్షలకు పైనే ఖర్చు

దాతల సాయం కోసం ఎదురుచూపులు





నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేటకు చెందిన యెన్నం నర్సింలు కడుపు క్యాన్సర్‌తో పోరాడుతూ.. ఆపరేషన్ ఖర్చులకు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. చిన్నపాటి ఉద్యోగం తో కుటుంబాన్ని పోషించుకుంటున్న నర్సింలుకు.. ఈ అనుకోని అనారోగ్య సమస్య ప్రాణ గుదిబండలా మారింది. నర్సింలు శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొన్ని నెలలుగా అతడు అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య పరీక్షలు చేయించగా.. కడుపులో క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. కాగా ప్రస్తుతం అతడు ముంబాయిలోని లోయర్ పారెల్‌లో గల సిద్ధాచల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి వేగంగా క్షీణిస్తుండడంతో తక్షణ శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెబుతున్నారు. వైద్యానికి దాదాపు రూ.6 లక్షల పైగా ఖర్చు అవుతుందని డాక్టర్లు అంచనా వేశారు. మరోపక్క కడుపు క్యాన్సర్ ఆరోగ్యానికి పెద్ద ముప్పు.. ఒకవేళ సరైన సమయంలో వైద్యం అందకపోతే ప్రాణమే ప్రమాదంలో పడొచ్చు. ఇంత పెద్దమొత్తంలో డబ్బు లు ఎలా తీసుకురావాని నర్సింలు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మవుతున్నారు. ఈ క్రమంలోనే స్నేహితు లు, సన్నిహితులతో కలిసి నిధులు సేకరించే ప్రయత్నం చేస్తు న్నారు. ఇలాంటి కష్టకాలంలో ముందుకొచ్చి.. ఓ ప్రాణాన్ని కాపాడాలని వేడుకుంటున్నారు. మానవతావాదులు ముం దుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు నర్సింహ 9441905308, దయానంద్ 9640103 221 నెంబర్లకు గూగుల్ పే లేదా ఫోన్ పే ద్వారా లేదా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌కు అకౌంట్ నెంబర్ 73082812551, ఐఎఫ్ఎస్‌సీ నెంబర్ ఏపీజీవీ0008154కు నేరుగా డబ్బులు పంపాలన్నారు.

సెట్విన్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నాం



నవతెలంగాణ-జహీరాబాద్

సెట్విన్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్టు సెట్విన్ సంస్థ ఎం.డి వేణు గోపాల్ అన్నారు. జహీరాబాద్ ఎంపీపీ సమావేశ మందిం ంలో సెట్విన్ చైర్మెన్ గిరిధర్‌రెడ్డితో కలిసి జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ట్రైనింగ్ సెంటర్‌ను గురువారం పరిశీ లించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలోని జహీ రాబాద్, హుస్నాబాద్, నల్గొండ, జడ్చర్ల, మహబూ బ్‌నగర్‌లలో కొత్తగా ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయ నున్నట్టు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 23 సెంటర్లు ఉన్నాయని.. అదనంగా 5 సెంటర్లను త్వరలోనే ప్రారంభిం చబోతున్నామన్నారు. తమ సంస్థ ద్వారా 60 కోర్సుల్లో యువతకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉపాధి పొందు తున్నారన్నారు. ఈనెల 17న హుస్నాబాద్‌లో మొదట సెంటర్‌ను ప్రారంభించి, రెండో సెంటర్‌ను జహీరాబాద్‌లో ప్రారంభిస్తామన్నారు. ప్రధానంగా జహీరాబాద్‌లో ఏసీ రిపేరింగ్, మొబైల్ రిపేరింగ్, సీసీ కెమెరాల రిపేరింగ్, ప్రీ ప్రైమరీ టీచర్స్, టైలరింగ్ తో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ లాంటి కోర్సులను మొదట ప్రారంభిస్తున్నా మన్నారు. ఆయా కోర్సులను బోధించేందుకు డిగ్రీ పాసై డిప్లమా పొందిన వారు ఈనెల 15లోపు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులకు ఈ నెల 19న ఇంటర్వ్యూ నిర్వహి స్తామన్నారు. నైపుణ్యాన్ని బట్టి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులకు తరగతులు బోధించాల్సి ఉంటుందన్నారు. ఒక ఒక బ్యాచ్‌లో 40 మంది విద్యార్థులు ఉంటారన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఇక్కడే జాబ్ మేళా నిర్వహించి వివిధ కంపె నీల్లో ఉద్యోగాలు వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న వివిధ పరిశ్రమల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి వారికి ఏ విధమైన శిక్షణ పొందిన వారు కావాలో ఆ విధమైన శిక్షణను ఇచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేయనున్నట్టు చెప్పారు.

కానిస్టేబుల్ కొట్టినందుకు మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

- న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట రహదారిపై బంధువులు, గ్రామస్తుల ధర్నా
- డీఎస్పీ హామితో ధర్నా విరమణ





నవతెలంగాణ-వట్‌పల్లి

పోలీస్ కానిస్టేబుల్ కొట్టడంతో మనస్థాపం చెంది ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. ప్రత్యక్ష సాక్షుల కథనం పప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాంపూర్ గ్రామానికి చెందిన తలారి కిషన్ (36) తన సెల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు చేసేందుకు గురురువారం ఉదయం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సాయిలు ఫిర్యాదును తీసుకోకుండా ఫోన్ ఎక్కడ పోగొట్టుకున్నావ్‌రా అంటూ బూతు మాటలు తిడుతూ, తప్పు తాగి తిరుగుతూ ఇంకా ఫోను పోయిందని ఫిర్యాదు చేస్తావారా అంటూ చేయి చేసుకొన్నాడు. అంతేకాకుండా ఎవనికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరించి స్టేషన్ నుంచి వెళ్లగొట్టాడు. స్వగ్రామానికి చేరుకొన్న కిషన్ గ్రామంలోని ఎస్సీ కమిటీ భవనం సమీపంలో కానిస్టేబుల్ సాయిలు కొట్టి తిట్టి బెదిరించినందుకు తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పక్కకు నిలిపిన బైక్ ట్యాంకు కవర్లో సూసైడ్ నోటు రాసి పెట్టాడు. కిషన్ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఈ విషయాన్ని గ్రామస్తులు కుటుంబీకులకు తెలియ జేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. బైక్ ట్యాంకు కవర్లలో లభించిన సూసైడ్ నోట్‌ను బట్టి కానిస్టేబుల్ సాయిలు కొట్టడంతోనే ఆత్మహత్యకు పాల్పడి నట్లు మృతుని కుటుంబీకులు, గ్రామస్తులు గుర్తించారు. గ్రామస్తులు, బంధువులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని 161 హైవే రహదారి సర్వీస్ రోడ్డు వద్ద పోలీసు నిర్వాకాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు మృతదేహన్ని ధర్నా వద్దకు తెచ్చేందుకు గ్రామస్తులు కుటుంబీకులు యత్నించినా సీఐ రేణుక రెడ్డి పోలీసులను పెద్ద ఎత్తున మోహరించి మృతదేహాన్ని తీసుకు రాకుండా అడ్డుకున్నారు. కుటుంబీకులకు న్యాయం జరిగే వరకూ, పోలీస్ కానిస్టేబుల్ సాయిలును సస్పెండ్ చేసే వరకు ధర్నా విరమించేది లేదని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు మొండికేశారు. బాధితులతో డిఎస్పి మాట్లాడుతూ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం స్వగ్రామంలో కిషన్ అంత్యక్రియలను పూర్తి చేశారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- ఇండస్ట్రియల్ పార్కుతో యువతకు ఉపాధి



నవతెలంగాణ-అక్కన్నపేట

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండలం చౌటపల్లి క్రాస్ వద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం స్థలాన్ని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్కును త్వరలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ ఇండస్ట్రియల్ పార్కుతో ఇక్కడి ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలియజేశారు. త్వరితగతిన స్థల సేకరణ పూర్తి చేసి పరిశ్రమల శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఇంటిగ్రేటెడ్ భవనాలను కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్దామని, ప్రజలను క్షేమంగా చూసుకోవడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, తహసిల్దార్ అనంతరెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, హుస్నాబాద్ అధ్యక్షుడు బంక చందు, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఆర్ఐలు యాదగిరి, జావేద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాస్కర్ నాయక్, చౌటపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పులికాశి రమేష్, అంతకపేట గ్రామ శాఖ అధ్యక్షుడు కాశబోయిన రవి, త్రిమూర్తి, బందారపు శ్రీనివాస్, గంపల శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని ఊట్ల, జిన్నారం వావిలాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యపు కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులు కొనుగోలు కేంద్రాలకు రోజువారీగా ధాన్యం తరలింపు తదితరు అంశాలపై ఆరా తీశారు. రైతాంగం ధాన్యపు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వివిధ అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం తహసిల్దార్ బిక్షపతి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, మండల సర్వేయర్ రామభద్రం, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు దామోదర్ అజారుద్దీన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఐకెపి బృందం, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

2

సంగారెడ్డి

శుక్రవారం | 08 నవంబర్ 2024 | www.navatelangana.com

చెకుముకి పాఠశాల స్థాయి ప్రశ్నాపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-జోగిపేట



సమగ్ర శిక్ష తెలంగాణ, జాన విజ్ఞాన వేదిక తెలంగాణ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీయేడు నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాలు 2024లో భాగంగా గురువారం పాఠశాల స్థాయి ప్రశ్న పత్రంను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ ఆవిష్కరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బండి కృష్ణ, ఎంపీడీవో రాజేష్ కుమార్, జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు వి. మహేష్ కుమార్ చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందోల్ మండలంలోని 8,9,10 తరగతులకు చెందిన తెలుగు, ఆంగ్ల మధ్యమాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 1494 మంది విద్యార్థులు పాఠశాల స్థాయి పరీక్షకు హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు వి. మహేష్ కుమార చారి తెలిపారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 21న నిర్వహించే మండల స్థాయి పరీక్షకు విధిగా హాజరవ్వాలన్నారు.



సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-కోహిర్

చంద్రశేఖర్ కోహి ర్ నవ తెలంగాణ

మండలంలోని దిగువాల్ గ్రామంలో గురువారం చేపట్టిన ఇంటింటి సర్వేను అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. సర్వే సక్రమంగా నిర్వహించాలని.. సర్వే చేసిన ఇంటికి స్టిక్కర్స్ వేయాలని సంబంధిత అధికారుల సూచించారు. ప్రజలకు కూడా ఈ సర్వేకు సహకరించాలన్నారు.

కుటుంబ సర్వే సక్రమంగా నిర్వహించాలి



నవతెలంగాణ-మనూర్

కుటుంబ సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డా పి.సంజీవ్‌రెడ్డి అన్నారు. నాగల్గిద్దా మండలంలోని ఔదాతపూర్ గ్రామాన్ని గురువారం సందర్శించారు. అధికారులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్న సర్వే.. సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌రావు, సర్వే చేసే సిబ్బంది పాల్గొన్నారు.

ఛట్‌పూజ సందర్భంగా చెరకు పంపిణీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ఉత్తరాది ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఛట్‌పూజ సందర్భంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీలో ఉన్న గణేష్ మండపం దగ్గర స్థానిక కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి గురువారం ఉత్తరాది ప్రజలకు చెరకును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బొల్లారంలోని బాలాజీనగర్‌లో భిన్నత్వంలో ఏకత్వం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అనేక రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది బాలాజీనగర్‌లో నివసిస్తున్నారని గుర్తు చేసారు. అందరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి కోసం బాలాజీనగర్ యువకులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుండ్ల మహేందర్ రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసిల్దార్ గా హరిచంద్ర ప్రసాద్

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మండల డిప్యూటీ తహసీల్దారుగా హరిచంద్ర ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్న తనను సంప్రదించాలని సూచించారు. పనిపట్ల అంకితభావంతో విధులు నిర్వర్తిస్తానన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది నూతన డిప్యూటీ తహసీల్దార్‌కు పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



నవతెలంగాణ-కొండాపూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 165 మంది విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ యూనియన్ సహకారంతో తమిళనాడులో ప్రత్యేకంగా స్పోర్ట్స్ యూనిఫామ్స్ తయారు చేయించి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాలకు, విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందియడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దశరథ్,గ్రామ మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, పీఏసీఎస్ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాణిక్ రెడ్డి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ శివ మోహన్,వెంకన్న,మంజునాథ్, సంతోష్ రెడ్డి, సాంబశివరావు, నరేష్ గౌడ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు, నాలా కన్వర్షన్ వివరాల కోసం దరఖాస్తు

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని మనసానిపల్లి గ్రామ సర్వేనెంబర్ 189లో 48 ఎకరాల 12 గుంటలకు సంబంధించి 09-11-2024 తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, నాలా కన్వర్షన్‌ల వివరాల కోసం సమాచార హక్కు చట్టం 2005 ద్వారా దరఖాస్తు చేసినట్టు కాంగ్రెస్ జిల్లా నాయకులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్‌కు గురువారం రోజున దరఖాస్తు అందజేసినట్టు చెప్పారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ప్రవీణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమశాతం 17 శాతం కంటే ఎక్కువ ఉండకుండా వరి ధాన్యాన్ని ఆరబెట్టే విధంగా రైతులు చూసుకోవాలన్నారు. వరి ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి దత్తు, రైతులు సుధాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కొండాపూర్



మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మహిళా వ్యవసాయ ఉత్పత్తిదారుల లిమిటెడ్ సీఈఓ విజయరాజు సీఈఎస్ఎస్‌లో తెలుసుకున్న విషయాల గురించి మహిళా రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీకి వాటాదనం కట్టడం, వాటి ఉపయోగాల గురించి క్లుప్తంగా వివరించారు. నూతన టెక్నాలజీ ఉపయోగించి అధికంగా దిగుబడి ఎలా సాధించాలో సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ మంజుల, వివోఏ లక్ష్మిమహిళలు పాల్గొన్నారు.

రేజింతల్‌లో నేటినుంచి గ్రామదేవతల పున: ప్రాణ ప్రతిష్ట



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామలో పురాతన గ్రామ దేవతల పున:ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నేటినుంచి మూడ్రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. బర్దిపూర్ అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు కొనసాగనున్నాయి. అందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

అందోలులో అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి

- 11 నుంచి 14 వరకు జోనల్ లెవెల్ స్పోర్ట్స్‌మీట్
- పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు

నవతెలంగాణ-జోగిపేట



అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ప్రారంభమయ్యే నర్సింగ్ కళాశాల పనులను, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులు, కళాశాల సిబ్బందితో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం పరిశీలించారు. ఆందోల్‌లోని గురుకుల పాఠశాలలో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగే జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌కి సంబంధించి ఏర్పాటు చేస్తున్న మైదానం పనులను, ఇతర అభివృద్ధి పనులను పర్యవేక్షించి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా గురుకుల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో తరగతులను డిజిటలైజేషన్‌గా మార్చాలని, ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేయించాలని, ఇతర మరమ్మత్తు పనులు చేపటాలని తెలియజేయడంతో ఆయన వెంటనే వాటికి సంబంధించిన పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జోగిపేట పట్టణంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న మైనార్టీ బాల, బాలికల రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రానున్న విద్యాసంవత్సరానికి మైనార్టీ బాలుర పాఠశాలను డిగ్రీ కళాశాల సమీపంలో వసతి గృహంలోకి మార్చాల న్నారు. 1141 సర్వే నంబర్‌లో మైనార్టీ గురుకులానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో,అక్కడే మైనార్టీ గురుకులా ఉండేలా చూస్తామన్నారు.బాలికలకు సంబంధించిన విద్యా సంస్థలన్నీ ఒకే చోట ఉంటాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ముందు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, ఈ విద్యాసంస్థల ముందు బస్‌షెల్టర్‌ను, వసతి గృహాల ముందు సెక్యూరిటీ గదులను ఏర్పాటు చేయిస్తామన్నారు. గురుకుల పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూర్చు నేందుకు షెడ్ నిర్మాణం, వాష్ రూమ్‌లను నిర్మించాలని మంత్రి తెలిపారు. 1141 సర్వే నంబర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను వేగవంతంగా నాణ్యతగా చేపట్టాలన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనకాల గాంధీ పార్క్ స్థలంలో వెజిటే బుల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్మెన్ మల్లయ్య, వైస్ చైర్మెన్ ప్రవీణ్, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డి.శివశంకర్, మాజీ వైస్ చైర్మెన్ రాములు, మాజీ వార్డు మెంబర్ పట్లోళ్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

నవతెలంగాణ-జోగిపేట

సంగుపేట వద్ద గల లక్ష్మీదేవి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్ర నగేష్ కూతురు రవళి, త్రిలోక్ చందర్‌ల వివాహ వేడుకకు మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. జైపాల్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శివశేఖర్, మాజీ మార్కెట్ చైర్మెన్ పి. నారాయణ, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దు

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-సదాశివపేట



పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మండల పరిధిలోని వెంకటేశ్వర కాటన్ మిల్లు వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతుల వద్ద పత్తి కొనుగోలు జరగాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్మని రైతులకు ప్రైవేటు కొనుగోలులో కూడా నష్టం జరగకుండా చూడాలన్నారు. అంతకముందు మిల్లులో రైతులతో మాట్లాడి ధర, విక్రయ ధర, రైతుల వేలిముద్రతో కూడిన ఆధార్ అను సంధానం, ఓటీపి విధానాన్ని గురించి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి రైతులకు ఎన్ని రోజులలో డబ్బులు ఖాతాలో జమ అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ గడీల రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చాట్ల సిద్దన్న, ఆత్మకూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంగన్న, సిసిఐ అధికారులు వరప్రసాద్, మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- సదాశివపేటలో ఇంటింటి సర్వేను పరిశీలన

నవతెలంగాణ-సదాశివపేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు తమ వివరాలు అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. సదాశివపేట పట్టణంలోని 25వ వార్డు హట్కర్ పేటలో గురువారం నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఈనెల 8వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలన్నారు. పక్కాగా సర్వే చేయాలని, ఏ రోజు ఎక్కడ సర్వే చేపట్టేది ముందుగా సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల కోసం మరిన్ని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికల రూపకల్పన కోసమే ఈ సర్వే చేపడుతున్నామని, ప్రజలు ఎటువంటి అనుమానం లేకుండా వివరాలు ఇవ్వాలని సూచించారు. సదాశివపేట మున్సిపాల్టీలో 94 మంది ఎన్యుమరేటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని.. మున్సిపాలిటీలో మొత్తం 94 బ్లాక్‌లు ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల వరకు ప్రతి ఇంటింటికి తిరిగి పట్టణంలో ఎన్ని ఇండ్లు ఉన్నాయో తెలుసుకొని ఇంటింటికి స్టిక్కర్ అతికించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమా, తాసిల్దార్ సరస్వతి, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, టిపిఓ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్ లు ప్రసన్న లక్ష్మీ శంకర్ గౌడ్, పిల్లోడి విశ్వనాథం, గుండు రవి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నిధులతో సూర్యభగవాన్ ఆలయ నిర్మాణం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్ట పైన రూ.50 లక్షల సొంత నిధులతో సూర్య భగవానుడు ఆలయం నిర్మించబోతున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపైన ఏర్పాటు చేసిన ఛట్ పూజ ఉపవాస దీక్షల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యేకగా పటాన్‌చెరు నియోజకవర్గం నిలుస్తోందన్నారు. నియోజక వర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతీయుల సంక్షేమానికి, ఆర్థిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తగు ప్రాధాన్యత అందిస్తున్నామన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ఉదయం 07:30 గంటలకు సూర్య భగవానుడి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పార్టీ నాయకులు అఫ్జల్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

గీతంలో పరిశోధనా పద్ధతులపై కార్యశాల

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ హైదరాబాద్ సోషల్ సైన్సెస్‌లో 'పరిశోధనా పద్ధతుల'పై పదిరోజుల కార్యశాలను ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి అత్యుత్తమ పరిశోధనలు చేపట్టడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు పెంపొంది ంచేందుకు లక్షించారు. సమర్థవంతమైన పరిశోధన ప్రణాళిక, అమలు, విశ్లేషణకు సంబంధించి సమగ్ర అంతర్దృష్టులతో పరిశోధకులు, విద్యావేత్తలు, నిపుణులను శక్తివంతం చేయడానికి ఈ కోర్సును రూపొందించారు. ఇందులో పాల్గొనేవారు క్రమబద్ధమైన సాహిత్య సమీక్షలు, పరిశోధన రూప కల్పన, డేటా సేకరణ, విశ్లేషణ పద్ధతులు, నైతిక పరిశీలనలు, అవసరమైన సాఫ్ట్‌వేర్ సాధనాలతో ఆచరణాత్మక శిక్షణ పొందు తున్నారు. పరిశోధనను బాధ్యతాయుతంగా నిర్వహించడం, వివిధ రకాల సమాచార విశ్లేషణ, పరిశోధనా రూపకల్పన, సాంకేతిక శిక్షణ, నమూనా పరిణామం నిర్ధారణ, అనులేఖనం, సమాచర సేకరణ వివరాలు పొందుపరచే విధానాలపై సదస్యులకు మంచి అవగాహన ఏర్పరచనున్నారు. పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు చెందిన నిపుణులు ఈ కార్యశాలలో వక్తలుగా పాల్గొని తమ అనుభవాలు, పరిశోధనా పద్ధతులపై పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్ నుంచి ప్రొఫెసర్ ఆర్.కె.మిశ్రా, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, ఓపీ జిందాల్ గ్లోబల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ రూపేష్ కుమార్, సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ శివోహం సింగ్, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్ స్టిట్యూట్ నుంచి డాక్టర్ నిత్య సుందర్ నందా వంటి పలువురు విద్యావేత్తలు ప్రధాన వక్తలుగా ఆయా ఎంపిక చేసిన అంశాలపై ప్రసంగిస్తూ, పరిశోధక విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.మనదేశంలోని పలు ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు చెందిన దాదాపు 30 మంది పరిశోధక విద్యార్థులు ఈ కార్యశాలలో పాల్గొని, తమ పరిశోధనా ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు తగిన నైపుణ్యాలను అలవరచుకుంటున్నారు.ఈ కోర్సు సహ సంచాలకుడు డాక్టర్ మనోజ్ కుమార్ పర్యవేక్షణలో డాక్టర్ కె.రఖా, డాక్టర్ శోభా మిశ్రాలు సమన్వయం చేస్తున్నారు. ఈ కోర్సు కేవలం నేర్చుకునే మెథడాలజీల గురించి మాత్రమే కాకుండా నైతిక పరిశోధన పద్ధతులు, మెథడాలాజికల్ కఠినత యొక్క సంస్కృతిని పెంపొందించడం గురించి కూడా విశదపరుస్తోందని కార్యశాల డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా తెలియజేశారు. సాంఘిక శాస్త్రాల రంగానికి అర్థవంతంగా దోహదపడే తదుపరి తరం పరిశోధకులను అభివృద్ధి చేయడానికి ఇది ఉపకరిస్తుం దన్నారు. వచ్చే గురువారం ఈ కార్యశాల ముగింపు వేడుక నిర్వహించి, ఆసక్తిగా పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను పంపిణీ చేయనున్నారు.

కాలుష్యాన్ని అరికట్టాలని పీసీబీకి ఫిర్యాదు

నవతెలంగాణ-జిన్నారం

గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో గల వివిధ గ్రామాలతో పాటుగా సమీప ప్రాంతాల్లో గల వాయు, జల కాలుష్యాన్ని అరికట్టాలని హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పిసిబి మెంబర్ సెక్రటరీ కార్యాలయంలో సదరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గడ్డపోతారం శివారు ప్రాంతంలో గల రామ్కీ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తదితరాలతో తీవ్రమైన కాలుష్య సమస్య వస్తోందని వాపోయారు. వాయు కాలుష్యానికి తోడుగా జల కాలుష్యం పట్టి పీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కాలుష్య సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి కలిగించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దూర్ పటేల్ బాలయ్య, నారబోయిన నాగరాజు, సత్యనారాయణ, నారబోయిన శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఉత్తరాది ప్రజల పవిత్ర పండుగలకు పెద్దపీట



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పారిశ్రామిక వాడలోని ఉత్తరాది ప్రజల పవిత్ర పండగలకు పెద్దపీట వేస్తున్నట్లు బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పోచమ్మ బస్తీలోని సూర్యభగవాన్ ఆలయంలో ఒడిస్సా, బీహార్ రాష్ట్రల వాసులతో కలిసి చట్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడికి మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మినీ ఇండియా'గా పేరొందిన బొల్లారం పారిశ్రామిక వాడలో ఉత్తరాది ప్రజల భక్తి విశ్వాసాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. వారి పండుగలో సైతం పాల్గొంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడి వారైనా ఇక్కడ అంతా కుటుంబ సభ్యుల'లాగే కలిసిమెలిసి జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కౌన్సిలర్ చంద్రారెడ్డిని స్థానిక నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ సి.ఐ, కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, నరసింహారాజు, కోప్షన్ మెంబర్ మునీర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, రాజ్ గోపాల్, దిననాథ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన పేరుతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

నవతెలంగాణ-గుమ్మడిదల



కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలను మభ్యపెడుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. కులగసణ పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంక్‌ల నుంచి ప్రభుత్వం సమాచారం తీసుకునే వీలునప్పటికీ.. బ్యాంకు వివరాలను కూడా బీసీ గణనలో పొందుపరచడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది కేవలం సమాన్యులను ఇబ్బందులకు గురి చేయడానికే తప్పా.. మరోటి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి నాయకులు దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మొగులయ్య, ఆకుల సత్యనారాయణ, భాస్కర్, సంజీవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, అంబర్పేట మహిపాల్ రెడ్డి తదితరులున్నారు.



ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-గుమ్మడిదల

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తున్నారా లేదా అని తహసీల్దార్ గంగాభవాని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాస్ రావును అడిగి తెలుసుకున్నారు. అయితే ఇప్పుడిప్పుడే రైతులు ధాన్యం తరలించి ఆరబెడుతున్నారని.. గురువారం నాటికి సుమారు అన్ని ధాన్యం కేంద్రాల్లో మూడు నాలుగు కుప్పలు మాత్రమే మ్యాచర్‌కు వచ్చినాయని వాటిని తూకం వేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని తాలు లేకుండా జల్లి పట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తరలించి వెంటనే తూకం వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, మండల పరపతి సంఘం చైర్మెన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, సీఈఓ లక్ష్మణ్ నాయక్, ఏఈఓ, రైతులు తదితరులున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-రాయికోడ్



ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని చిమ్మాపూర్ ఎక్స్ రోడ్‌లో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ దశరథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ మండల అధ్యక్షులు అశోక్, ఉపా ధ్యక్షులు కరుణాకర్, కార్యదర్శి నవీన్ కుమార్ ,కోశాధికారి సుధాకర్, సభ్యులు రాజు, ప్రదీప్,శాంతం, ఇస్మాయిల్, అమృత్, అశోక్,సుమన్, అంబుపటేల్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

- మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ

నవతెలంగాణ-తూప్రాన్



పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రభావతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్తులో మంచిగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, మంచిగా చదువుకొని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలల్లో ర్యాగింగ్ వంటి చర్యలు చేపట్టినా, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీంద్ర గుప్తా, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హరితహారంలో పెట్టిన మొక్కల నరికివేత

- మొక్కల నరికివేతపై చర్యలు చేపట్టని మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-తూప్రాన్



మున్సిపాలిటీలోని తూప్రాన్ పట్టణం నుంచి ఆవుబోతుపల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా హరితహారంలో పెట్టిన మొక్కలను దుండగులు యదేచ్ఛగా నరికి వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆబోతుపల్లికి చెందిన స్థానిక గ్రామస్తులు కొన్నేళ్లుగా ఎండాకాలంలో నీరు పోసి, రక్షించి, పెంచిన మొక్కలను నరికి వేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి పెంచిన మొక్కలను నరికి వేస్తుంటే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రకృతిలో మొక్కలు జీవన మనుగడకు ఎంతో అవసరమని, వాటిని పెంచడంలో మానవులు బాధ్యత తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని, మండలంలో పెంచుతున్న మొక్కలను నరికి వేయకుండా మున్సిపల్ అధికారులు రక్షించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

వరిధాన్యాన్ని తప్పనిసరిగా జాలి పట్టాలి

- మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి

నవతెలంగాణ-మనోహరాబాద్



రైతులు పండించిన వరిధాన్యాన్ని తప్పనిసరిగా జాలి పట్టి కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి సెంటర్ నిర్వాహకు లకు సూచించారు. గురువారం మండలంలోని దండుపల్లిలో గల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారిణి సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల వరిధాన్యాన్ని మాశ్చర్‌ను పరిశీలించారు. ధాన్యంలో ఎలాంటి పొల్లు పొట్టు చెత్త లేకుండా తప్పనిసరిగా జాలీ పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

సమగ్ర సర్వేలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

- మెదక్ జిల్లా డీపీఓ యాదయ్య

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నమోదు చేయాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. గురువారం పెద్ద శంకరంపేటలోని పలు గృహాలలో సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సమగ్ర సర్వేకు సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఈవో వెంకట రాములు, సిబ్బంది ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-నిజాంపేట



మండల వ్యవసాయ అధికారి మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి మాట్లాడుతూ రైతులు ఎఫ్ఏక్యూ నార్మ్స్ పాటిస్తూ వరి విత్తనాలను, ధాన్యమును, కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. అదేవిధంగా దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారితో పాటు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు, రైతులు, పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ మార్పు

- అంగన్‌వాడి టీచర్ మేఘమాల

నవతెలంగాణ-కొల్చారం



విద్యతోనే సమాజ మార్పు అవుతుందని కొల్చారం అంగన్‌వాడీ టీచర్ మేఘమాల అన్నారు. గురువారం కొల్చారంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ మేఘమాల మనుమరాళ్ళు మోదిని ఆశ్రిత ఎనిమిదవ జన్మదినం, మోదిని హన్విక నాలుగవ జన్మదినాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడి విద్యార్థుల కు బ్యాగులు, పలకా, బలపాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివితేనే జీవితంలో రాణిస్తారని ఆదిశగా ముందుకు పోవాలని కోరారు. అలాగే చిన్నారులు క్రమశిక్షణతో పౌష్టికాహారం తింటూ చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పాఠశాల ఆయమ్మ ప్రమీల, మౌనిక, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో చెకుముకి పోటీలు

నవతెలంగాణ-పాపన్నపేట



మండల కేంద్రమైన పాపన్నపేట తోపాటు మండల పరిధిలోని నాగ్సన్ పల్లి ఉన్నత పాఠశాలల్లో గురువారం చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు అంజా గౌడ్, కృష్ణ కాంత్, మోహన్ రావు, వేణుగోపాల్, నర్సింహులు, శ్రావణ్, కవిత, తోపాటు నాగసాన్పల్లి పాఠశాల ఉపాధ్యాయులు రామ్ కిషన్, అశోక్ కుమార్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వే

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో గురువారం ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వే ఎంపీడీవో రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిశీలకులుగా జెడ్పిసీఈవో సిహెచ్ ఎల్లయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్సింలు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో పాఠశాల అభివృద్ధికి నిధులు

- నత్తి మల్లేష్ ముదిరాజ్

నవతెలంగాణ-మనోహరాబాద్



పరిశ్రమలు సీఎస్ఆర్ నిధుల నుంచి గ్రామాల అభివృద్ధితో పాటు పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం అభినందనీయమని రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, కాళ్ళకల్ తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. కాళ్లకల్ పట్టణంలో గల యూపీఎల్ అడ్వాంటా ఫీడ్ కంపెనీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో కాళ్లకల్ హైస్కూల్లో పాలు రినోవేషన్ పనులు చేపట్టి గురువారం భూమి పూజ కార్యక్రమాలను చేశారు. పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.22 లక్షల రూ. 28 వేల ఒక వందలతో పాఠశాలలో స్టేజ్, ప్యాచ్ వర్క్, గ్రిల్, కాంపౌండ్ వాల్ పనులను చేపడుతున్నారు. అలాగే పాఠశాల విద్యార్థులకు రూ.లక్షల విలువగల క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేదల విద్యార్థులే చదువుకుంటుంటారని వారి కోసం పాఠశాలను అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో వసతులను కల్పించేందుకు పరిశ్రమలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు డాక్టర్ ఎస్ఎన్ త్రిపాఠి, రేణిత, జయంత్, సతీష్, పరమేష్, సోమనాథ్‌లతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన గేరిగంటి శివకుమార్ నెలరోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. అతని కుటుంబానికి గ్రామ యువకుల సహకారంతో వాళ్ళ కుటుంబానికి రూ.65 వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మాకు తోచిన విధంగా ఆర్థిక సాయం అందించడం జరిగిందని ఇదేవిధంగా ఇంకా ఎవరైనా యువకులు ముందుకు వచ్చి ఇటువంటి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు .ఈ కార్యక్రమంలో జిపి స్వామి, గేరింగంటి బాబు, పంజా బాబు, వడ్ల నాగరాజు, జాల రవి, మసుల నాగరాజ్, బోయిని పవన్, గడ్డం రాజు, మ్యాదరి మధు, షాదుల్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు .

రావి ఆకుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటం

నవతెలంగాణ-మనోహరాబాద్



రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన చిత్రపటాన్ని రావి ఆకుపై ముద్రించి శుభాకాంక్షలు తెలిపారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని జడ్‌పీ హెచ్ ఎస్ పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని రావి ఆకుపై ముద్రించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-తూప్రాన్



మున్సిపాలిటీలోని రావెల్లిలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎసీఎస్(సొసైటీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేసే కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్రం వద్దకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టిన అనంతరం తేమశాతాన్ని పరిశీలించాలని, వరి ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, లారీల్లో దాన్యం బస్తాలను నింపి, అందుబాటులో ఉన్న రైస్ మిల్‌లకు వెంటవెంటనే పంపించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దన్నారు. ధాన్యం కొనుగోలు అయినా తర్వాత 72 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత లేకుండా, గన్ని బ్యాగులను సర్దుబాటు చేయాలని, జల్లి మిషిన్ అందుబాటులో ఉంచాలని, రైతులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఐకేపీ, సొసైటీ కేంద్రాల నిర్వాహకులు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఏదైనా సమస్య తలెత్తినా, కొనుగోలులో జాప్యం జరుగుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ తహశీల్దార్ విజయలక్ష్మి సొసైటీ సంబంధిత అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి

మున్సిపాలిటీలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సమగ్ర ఇంటింటి సర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిమిత్తం అధికారులు సందర్శించినప్పుడు తమ పూర్తి సమాచారాన్ని అందించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని, అధికారులు ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకోకుండా, ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం సర్వే నిర్వహించాలని, ఎక్కడైనా పొరపాట్లు జరిగితే మళ్లీ (రీ స్టిక్కర్స్, రీ సర్వే) మొదటి నుంచి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు పొలాలకు ఉదయం వెళతారు గనుక ఇంట్లో ఉన్న సమయంలో తొందరగా వెళ్ళి సర్వే నిర్వహించాలని, సెల్ఫ్, డిక్లరేషన్ భాష, కోడ్‌లను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ పి.గణేష్ రెడ్డి, తూప్రాన్ తహశీల్దార్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు రవీంద్ర గుప్తా, రవీందర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, సంబంధిత అధికారులు, సర్వే చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్



రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి ఆర్థికంగా లాభపడాలని దళారులను నమ్మి మోసపోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని పోతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ సుహాసినిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు మద్దతు ధరనిస్తారని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ జడ్‌పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పోతారం గ్రామ మాజీ సర్పంచ్ బడికోలు మాధవరెడ్డి, జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పంచమి రేణుకుమార్, మాజీ ఉపసర్పంచ్ వీరేశం, నాయకులు మహెందర్, కరుణాకర్‌రెడ్డి, శివ్వంపేట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్, పర్కిబండ మాజీ సర్పంచ్ పూల అర్జున్, డిప్యూటీ తహశీల్దార్ కౌశికారెడ్డి, వ్యవసాయ శాఖ ఏఈవో నరెందర్‌గౌడ్‌లతో పాటు నాయకులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతుల పట్ల పక్షపాతి ధోరణి వహిస్తున్న ప్రభుత్వం

- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



ప్రభుత్వం రైతులపై అన్ని విధాల పక్షపాతి ధోరణి వహిస్తుందని అది సరైనది కాదని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వైమాందాపూర్, కోనాపూర్, పైతర, తుక్కాపూర్ గ్రామాల్లో రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేవని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులపై పక్షపాతిక వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి దాదాపు నెల రోజులు కావస్తున్నప్పటికీ నేటికీ కూడా ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అలాగే రవాణా సౌకర్యం సక్రమంగా లేదని దొడ్డు, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సన్న, దొడ్డు రకం వడ్లకు బోనస్ కల్పిస్తామన్న ప్రభుత్వం శరతులతో కూడిన కొన్ని రకం వడ్లకి బోనస్ చెల్లిస్తామని చెప్పడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా బేషరతుగా దాన్ని కొనుగోలు చేయాలని రైతులను అవమానపరిచే విధంగా వ్యవహరించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షులు గౌరీ శంకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అడిగి రమేష్ కుమార్, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, సీతఈవో నవీన్, మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, టీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు సంతోష్ రావు, రవితేజ రెడ్డి, ఆంజనేయులు, రవీందర్, వెల్మకన్నె ఎల్లేశం, కలాలి మల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ప్రారంభోత్సవం

- తపాల ఇన్స్పెక్టర్ సందీప్ కులకర్ణి

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధి హస్తాల్ పూర్ గ్రామంలో నూతనంగా తపాల శాఖ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌ను గురువారం తపాల ఇన్స్పెక్టర్ సందీప్ కులకర్ణి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మజార్ రఘురాములు స్వజనలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం తపాల ఇన్స్పెక్టర్ సందీప్ కులకర్ణి మాట్లాడారు. ఉత్తరాల బట్వాడ, చిన్న మొత్తాల పొదుపు, ఖాతాలు రికరింగ్ డిపాజిట్, సుకన్య పథకం, మహిళా సమ్మర్ పథకం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలతో పాటు ప్రజలకు చేయూతగా నిలవాలని సంకల్పంతో తపాల శాఖ తమ క్లస్టర్‌కు సేవలు అందిస్తుందని ఆయన తెలిపారు. తపాల బీమాను ప్రజల్లోనికి తీసుక వెళ్లేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. అలాగే ఇండియా పోస్ట్ పేమెంట్, బ్యాంకు ద్వారా బ్యాంకింగ్ సేవలు ప్రతి పోస్ట్ ఆఫీస్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. తక్కువ ప్రీమియంతో అందించే ప్రమాద బీమా పాలసీలను ప్రతి ఒక్కరు సద్వినం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శివశంకర్, మాజీ సర్పంచ్ పాండురంగం, ఉపసర్పంచి రమేష్, ఎంపీటీసీ బాబు, మెయిల్ ఓవర్స్ సర్ విజయ, కృష్ణ, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గ్రీన్కో ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన శంకాపూర్ గ్రామంలోని గ్రీన్కో సోలార్ కంపెనీ యాజమాన్యం ప్రతి సంవత్సరం ఇచ్చే విధంగా ఈ సంవత్సరం కూడా శంఖాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ ఆటలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఆయన ముఖ్యఅతిథిగా ఎస్.జి బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం తరపున క్లస్టర్ ఎస్ బాబు, సైట్ ఇన్చార్జి మహేష్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాల విద్యార్థులకు తమ కంపనీ తరపున ఆట వస్తువులను అందజేస్తామని, గడిచిన సంవత్సరం విద్యార్థులకు బెంచీలు, ఆట వస్తువులు జీ.కే బుక్స్ లాంటివి అందజేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వామి, గ్రీన్కో సోలార్ కంపెనీ సిబ్బంది గణేష్, సాయి బాబు, మహేష్ గౌడ్, అభిలాష్ గౌడ్, ఉపాధ్యాయులు స్రవంతి, భవాని, విజయ లక్ష్మి, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన గుర్రాల అంజవ్వ, బాలయ్యల కూతురు శ్రీలేఖ వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు మోహన్ నాయక్ పుస్తే, మట్టెలను అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు మోహన్ నాయక్‌కు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధ రాములు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ పేదింటి ఆడపిల్లలకు పుస్తే మట్టెలను అందజేస్తూ అనాధ పిల్లలకు కూడా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు ఆయనకు భగవంతుడు అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో చూడాలని భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో , దుబాసి సంజీవ్, రమావత్ రాజు, మలావత్ బాబు, మెట్టు చంద్రం, దొంతరమైన శ్రీనివాస్, మంగలి అంజయ్య, సాకలి రవి, యమ్మ రవి, సుగుణ, అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భవానీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాపన్నపేట



మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గురువారం ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఏడుపాయలకు చేరుకోగానే ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు, అర్చనలు, నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గౌస్, నరేందర్ గౌడ్, పార్శ నర్సింలు, ఇంద్రసేనారెడ్డి భరత్ గౌడ్, కిష్టయ్య, నాని, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులున్నారు.

ఏడుపాయల ఈవో పై ఆగ్రహం

ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ పనితీరుపై ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు ఆగ్రహం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆయన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రతి విషయంలో అతిగా ప్రవర్తిస్తున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఈవో పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏడుపాయల నుంచి ఈ వోను తమ వెంట కారులో ఎక్కించుకొని తీసుకెళ్లి మరి అగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రెండో రోజు సర్వే

- కుటుంబ సభ్యులందరూ ఉండవలసిన అవసరం లేదు
- ఎంపీడీవో ఉమాదేవి

నవతెలంగాణ-వెల్దుర్తి



మరో రెండు రోజుల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. ప్రస్తుతం హౌస్ స్టిక్కర్ ప్రక్రియ గురువారం రెండో రోజు జరిగింది. గత ప్రభుత్వం 2014 ఆగస్టు 19న ఒక్క రోజుల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసింది. ఆ సమయంలో కుటుంబీకులు అందరూ వారి వారి ప్రాంతాలకు చేరుకోగా పండుగ వాతావరణం కనిపించింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే హౌస్ స్టిక్కర్ వేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. 9 నుంచి పూర్తి సమగ్ర సర్వే నిర్వహించడం జరుగుతుందని, స్పెషల్ అధికారి ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. ఉమ్మడి మాసాయి పేట్, వెల్దుర్తి మండలాలకు సంబంధించి, మాసాయిపేట మండలంలో 4,300 ఇండ్లు ఉన్నాయి అన్నారు. 31 మంది ఎన్యుమరేటర్, 5 మంది సూపర్వైజర్లు, 31 బ్లాకులు. వెల్దుర్తి మండలంలో 8,4,43 ఇండ్లు, 70 మంది ఎన్యుమరేటర్, 64 ఇన్సుమెంట్ బ్లాకులు, 9 మంది సూపర్వైజర్లులతో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని, ఎంపీడీవో స్పెషల్ అధికారి ఉమాదేవి గురువారం తెలిపారు. 10 రోజులపాటు కొనసాగుతున్న సర్వేలో కుటుంబ సభ్యులందరూ ఉండవలసిన అవసరం లేదు. కుటుంబానికి సంబంధించిన వారు ఎవరో ఒకరు వివరాలు చెప్తే సరిపోతుంది. ఎన్యుమరేటర్లు ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల వారు అభ్యున్నతి కోసం సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు రూపొందించుచున్నామని ప్రభుత్వం చెబుతుంది. 56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 ప్రధాన, మరో 19 అనుబంధ ప్రశ్నలకు (మొత్తము 75) పార్ట్ -1, పార్ట్ -2 కింద 8 పేజీల్లో సమాచారం సేకరిస్తారు. పార్ట్-1లో కుటుంబ యజమాని సభ్యుల వ్యక్తిగత వివరాల కింద సాధారణ విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్, ప్రయోజనాలు రాజకీయ, వలసల, సమాచారం అడుగుతారు. పార్ట్ -2 కింద కుటుంబ వివరాలు సేకరిస్తారు. ఈ విధంగా ప్రభుత్వం ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

పగడ్బందీగా ఇంటింటి సమగ్రసర్వే

- ఎంపీడీవో యాదగిరిరెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్



రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మనోహరాబాద్ ఎంపీడీవో యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గౌతోజిగూడ, పర్కిబండ, పోతారం, పాలాట, రామాయిపల్లి గ్రామాలలో ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. కాగా ఎంపీడీవో యాదగిరిరెడ్డి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పర్వేలో నమోదు చేయాల్సిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకుని పూర్తి చేయాలని సూచించారు. అలాగే సర్వే అనంతరం ఇంటికి స్టిక్కర్‌ను అతికించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీవో లక్ష్మినర్సింలు, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్యుమరేటర్లు, అంగన్‌వాడి టీచర్లు, వీవోఏ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉసిరితోటలో వెంకటాయపల్లి విద్యార్థుల వనభోజనాలు

- కార్తిక మాస వనభోజన మహోత్సవం

నవతెలంగాణ-తూప్రాన్



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటాయపల్లి విద్యార్థినీ,విద్యార్థులు,ఉపాధ్యాయ బృందంతో కలిసి ఉసిరి తోటలో గురువారం వన భోజనానికి వెళ్లారు. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ పి.శారద ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజన మహోత్సవాన్ని పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉసిరి తోటలో ఘనంగా నిర్వహించారు. వన భోజన మహోత్సవంలో ఉన్నత పాఠశాల 160 ప్రాథమిక పాఠశాల 100 మంది విద్యార్థినీ, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఎంతో ఆనంద ఉత్సాహాలతో వనభోజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటలు, పాటలు, వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని, సంతోషదాయక వాతావరణంలో వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఉల్లాసంగా,ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి.సిద్ధిరాములు, శివకుమార్, వసుధ, రతన్, రవీందర్, పద్మ, మల్లికలతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్కమ్మ, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

- ఆర్డీవో జయచంద్రారెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో జయచంద్రరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకటరత్నపూర్, రావెల్లి, ఇస్లాంపూర్, దాతర్ పల్లి, వెంకటాయపల్లి గ్రామాలలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు పలు సూచన చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను రైతుల ఖాతాలో 72 గంటల్లో జమ చేస్తామన్నారు. ఇంకా కొన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, హమాలీల కొరత లేకుండా చూడాలని, గన్ని బ్యాగులను సర్దుబాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీల్లో నింపి, రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయలక్ష్మి డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లతో సమావేశం

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ : మున్సిపాలిటీలోని కులగణన, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లతో ప్రత్యేక సమావే శాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో జయచంద్రరెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో పక్కా సమాచారంతో వివరా లను సేకరించాలన్నారు. కుటుంబ సభ్యులు తెలిపే వివరా లు వాస్తవాలుగా ఉండాలన్నారు. తప్పుడు సమా చారాన్ని సేకరిం చొద్దని, సొంత నిర్ణయాలు తీసు కోవద్దని, సర్వే ని యమ, నిబంధ నలకు అనుగుణంగా సర్వే చేపట్టాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. మున్సిపాలిటీ ప్రజలు సర్వే చేస్తున్న ఎన్యు మరేటర్లు, అధికారులు, ఉపాధ్యాయులకు సహకరించా లన్నారు. సర్వే చేపట్టిన సమయంలో కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోతే తర్వాత మళ్లీ ఆ కుటుంబ సభ్యుల వద్ద వివరాలు సేకరించాలని సూచించారు. నిర్ణయించిన గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో తహశీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ గణేష్ రెడ్డి, మేనేజర్ రఘువరన్, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, వార్డు ఆఫీస ర్లు, సర్వే ఎన్యుమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

వరి పంట క్షేత్ర స్థాయి పర్యటన చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు



నవతెలంగాణ-నార్సింగి : మండల వ్యాప్తంగా పన్నెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏడు, సొసైటీల ఆధ్వర్యంలో నాలుగు, రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి ఒకటి ఏర్పాటు చేశామని ఇంచార్జీ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజు నారాయణ తెలిపారు. మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మేంగని యాదగిరితో పాటు వరి పంటల క్షేత స్థాయి పర్యటన చేసి పంటలను పరిశీలించారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 5975 ఎకరాలలో వరి పంట పండి నట్టు, దానితో వరి దిగుబడి పన్నెండు వేల ఐదు వందల నుంచి పధ్నాలుగు మెట్రిక్ టన్నుల వరకు వస్తుందని, అందులో నుంచి 540 సన్న వడ్లు వేసారని, దానితో ఒక మెట్రిక్ టన్ను సన్న వడ్లు వచ్చే అవకాశం ఉందని, దానికి తగ్గట్టుగానే అన్ని ఏర్పాట్లు జరిగాయన్నారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, దళారులను నమ్మి మోస పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి లబ్ధి పొందాలని కోరారు.

మండల మూడో మహాసభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండలం కార్యదర్శి చొప్పరి రవికుమార్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండల మూడో మహాసభను పార్టీ కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్ కోరారు. గురువారం మండల మహాసభల కరపత్రలను అంబేద్కర్ నగర్ బాలాజీ థియేటర్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మండల మహాసభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా రైతు యువజన మహిళ వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో పోరాటాలు చేయడానికి కర్తవ్యాలను దిశా నిర్దేశం చేయడం కోసం చర్చించబోతున్నారని అందుకని ఈ మహాసభలు విజయవంతం కావాలని అన్నారు. ఈ మహాసభలుకు ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్లు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభల్లో రానున్న మూడేండ్లకు సంబంధించిన కర్తవ్యాలను రూపకల్పన చేసి వాటి కనుగుణంగా పోరాటాలను కొనసాగిస్తారని తెలిపారు. ఈ మహాసభల కరపత్ర ఆవిష్కరణలో పార్టీ అర్బన్ మండల కమిటీ సభ్యులు కొండం సంజీవ్ కుమార్, పార్టీ నాయకులు బాలు, నరేష్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సిద్దిపేట

శుక్రవారం | 08 నవంబర్ 2024 | www.navatelangana.com

అరటి తోట పరిశీలన

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం కుందన్ వానిపల్లి గ్రామంలో గురువారం రైతుల పంట పొలాలను జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఏఈఓ శ్రీలత ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు శారదకు అరటి తోట పెంపకం గురించి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా అందించారు. తదనంతరం వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలు బాగా పండించుకోవాలని తెలియజేశారు. మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ కన్సల్టెంట్ నాగరాజు, బాలాజీ, ఆయిల్ ఫెడ్ ఆఫీసర్ రవళి, రైతులు స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేసిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు బోయిని అజయ్ ప్రమాదవశాత్తు మరణించడంతో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రూ.లక్ష పమాద బీమా చెక్కును నామినీ బోయిని అనసూర్యకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్యాంక్ మేనేజర్ నారోజు రామకృష్ణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ఆర్థిక సాయం అందజేసిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



మిట్టపల్లి సురభి మెడికల్ కాలేజిలో మెడిసిన్ సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న హుస్నాబాద్ మండలంలోని బల్లు నాయక్ తండాకి చెందిన గిరిజన విద్యార్థి లావుడ్య దేవీకి హాస్టల్ ఖర్చుల నిమిత్తం గురువారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో రూ.1.50 లక్షల చెక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు, మాజీ పట్టణ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-చేర్యాల



ఫైల్

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ శివారు బండపల్లి క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పర్వాటకం ధర్మారెడ్డి (49) మండల పరిధిలోని చుంచనకోట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా గురువారం ధర్మారెడ్డి బైక్ పై విధులకు హాజరు కావడానికి వెళుతుండగా కోతి అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శకుంతల మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన కుటుంబ సర్వే

నవతెలంగాణ-నంగునూరు

సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే రెండో రోజైనా గురువారం నంగునూరు మండలంలో కొనసాగింది. ఇండ్ల జాబితా సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వే చేసి ఇంటికి స్టిక్కర్లు అతికించారు. ఈ సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించి నమోదు చేసుకోవాలని కోరారు. మండలానికి చెందిన సూపర్ వైజర్‌లు, అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-గజ్వేల్



స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల బాలుర జూనియర్ కళాశాలలో అగ్ని ప్రమాదాలు, వివిధ రకాల విపత్తుల నివారణ కోసం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సేవా సిబ్బంది వివిధ రకాల విపత్తుల పలు విషయాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నుంచి ఏ విధంగా బయటపడాలో పలు రకాల మార్గాలను డెమో ద్వారా చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రాణాలకు సైతం తెగించి అగ్ని ప్రమాదాలు, విపత్తుల నుంచి ప్రజల్ని కాపాడుతున్నటువంటి అగ్నిమాపక సేవా సిబ్బందికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞులై ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, గజ్వేల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది, కళాశాల సీనియర్ లెక్చరర్లు వెంకటరమణ, శ్రీ రాజిరెడ్డి, ప్రకాష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.24


ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

నవతెలంగాణ-జగదేవపూర్

ప్రపంచ క్యాన్సర్ అవగాహనా దినోత్సవ కార్యక్రమం సందర్భంగా జగదేవపూర్ మండల కేంద్రంలో గల మాస్టర్ మైండ్ పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తరువాత బస్ స్టాండు, గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి పీహెచ్ సి నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్కూలు విద్యార్థులు వైద్యులను పలు సందేహాలను వ్యక్తపరిచి సందేహాలను నివృత్తి పరచుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వైద్యులు సత్యప్రకాశ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫిసర్ శ్రీమతి, పీహెచ్‌సీ స్టాఫ్, ఆశా కార్యకర్తలు, మాస్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యం రాఘవేంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఇంచార్జి నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

నవతెలంగాణ-బెజ్జంకి




మండల పరిధిలోని రేగులపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సందర్శించి పరిశీలించారు. కొనుగోల్లు పూర్తయిన వరిధాన్యాన్ని త్వరగా మిల్లలకు తరలించాలని ఆయన ఇంచార్జీలకు సూచించారు. డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, డీఎస్ఓ తనుజ, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీన్, పంచాయతీ కార్యదర్శి జీవన్ రెడ్డి, సీసీలు హాజరయ్యారు.

కథ, కవిత పోటీల్లో లక్ష్మీదేవిపల్లి విద్యార్థి ఎంపిక

- ఈనెల15న దేవులపల్లి రామానుజారావు కళామందిర్ సారస్వత పరిషత్తులో బహుమతి ప్రదానం

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని దుర్గం రష్మిత తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన కథ, కవిత పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 15న దేవులపల్లి రామానుజారావు కళామందిర్ సారస్వత పరిషత్తులో జరిగే సన్మాన కార్యక్రమంలో రష్మితకు బహుమతి, ప్రశంస పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన రష్మితను నారాయణరావు పేట మండల విద్యాధికారి గౌరీ మోహన్, ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజలు అభినందించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలోని పెద్దతండా, మోత్కులపల్లి గ్రామపంచాయతీలో ఐకేపీ సెంటర్‌ను ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తొందరపడి వరి ధాన్యం దళారులకు అమ్మకూడదని ప్రభుత్వం తీసుకుంటుందని తెలియజేశారు. రైతులు సన్నరకం ధాన్యానికి క్వింటాలకు రూ.500ల బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గూగులోతు రాంబాబు నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, గొర్ల ఐలేష్ యాదవ్, మోత్కులపల్లి మాజీ సర్పంచ్ కుమార్ యాదవ్, ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగులోతు భాస్కర్ నాయక్, మహిళా సంఘం అధ్యక్షురాలు, మంగమ్మ, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు రాగుల రాజు, గుగులోతు వీరన్న పంచాయతీ కార్యదర్శిలు శ్రీనివాస్ నాయక్, రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు షురూ..





- తాత్కాలిక రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టిన అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పద్మనాభునిపల్లి గ్రామస్తులు
- దుబ్బాక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ నుంచి పద్మనాభునిపల్లి, కొండా పూర్, అందే వరకు సుమారు 12 కిలో మీటర్ల బీటీ రోడ్డు అధ్వానంగా మారి పూర్తిగా దెబ్బతింది. ఈ సమస్యను గ్రామస్తులతో పాటు ఆ వైపు ప్రయాణించే వాహనదారులు, పాదాచారులు 12 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని మెదక్ మాజీ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యేను పలుమార్లు దుబ్బాక మాజీ జడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కండ్లకొయ్య పర్శరాములు, బీఆర్ఎస్ నాయకులు నేరుగా కలిసి ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యను 2ఏళ్లుగా విన్నవించారు. ఎంపీగా ఉన్నప్పుడే డబుల్ రోడ్డు మంజూరు చేయిస్తానని పద్మనాభునిపల్లికి వచ్చిన ఓ సందర్భంలో హామీ ఇచ్చారు. వెను వెంటనే సమస్యను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. తర్వాతే డబుల్ మంజూరు ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తర్వాత జరిగిన శాసన సభ ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి పోటీ చేసి ప్రచార సమయంలో తాను గెలిచాక తిమ్మాపూర్ నుంచి అందే వరకు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఆయన గెలిచాక అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అసెంబ్లీ సమావేశంలో దుబ్బాక నియోజకవర్గ రోడ్ల దుస్థితి, ప్రజలు, రైతులు, ఎదుర్కొంటున్న సమస్యలను సభలో విన్నవించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు రోడ్లు, బీటీ రోడ్లను మంజూరు చేస్తూ ప్రకటన చేసింది. దీంతో తిమ్మాపూర్ నుంచి పద్మనాభునిపల్లి, కొండాపూర్, అందే వరకు రోడ్డు సౌకర్యం కోసం ఇటీవల మరోసారి మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జిల్లా ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి తిమ్మాపూర్ నుంచి అందే వరకు బీటీ రోడ్డు పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. దీంతో అధికారులు చలించి తాత్కాలిక రోడ్డు పనులను చేపట్టారు. భారీగా గుంతలు, కంకర తేలిన చోట మట్టిని నింపి రోడ్డు రోలర్‌తో తొక్కించే పనులు చేస్తున్నారు. ప్రస్తుతానికి తిమ్మాపూర్ నుంచి పద్మనాభునిపల్లి వరకు పనులు జరిగాయి. ఈ మార్గంలో వాహనాలకు, ప్రజలకు రాకపోకలు సాఫీగా సాగనున్నాయి. నిత్యవసరాల కోసం, వ్యక్తిగత పనుల నిమిత్తం, ఆస్పత్రులకు వెళ్ళే వారి కష్టాలకు కొంతమేరకు ఉపశమనం కలుగ నుంది. ఇక సిద్దిపేట వెళ్ళే వారి ప్రయాణం సులభతరవుతుందని పద్మనాభునిపల్లి గ్రామస్తులు, వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు. పూర్తి స్థాయిలో రోడ్డు పనులు జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ నవతెలంగాణతో ఫోన్లో సంభాషించారు. గత రెండేళ్ల క్రితం నవతెలంగాణ తెలుగు దినపత్రికలో "గుంతల మాయం" "రోడ్లపై వరి నాట్లు"అనే శీర్షికలతో కథనాలు ప్రచురించి సమాజంలో ప్రజా సమస్యలను అటు అధికారులు, ఇటు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో "నవతెలంగాణ పత్రిక "ముఖ్య భూమిక పోషించడం అభినదనియమని పద్మనాభునిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక పనులు చేపట్టడం హర్షణీయం



దుబ్బాక ఎమ్మెల్యే వాహనదారులు, ప్రజల కష్టాలను గుర్తించి తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టడం సంతోషకరంగా ఉంది.12 ఏళ్ళకు పైగా తిమ్మాపూర్ నుంచి అందే బీటీ రోడ్డు నిర్మాణం జరగలేదు. నిత్యం ఆటోలు, బైకులపై ప్రయాణించే వాహనదారులు వారి వాహనాలు తరుచూ రిపేర్ కావడంతో అదనపు ఖర్చులు ఎక్కువయ్యేవి. మెదక్ మాజీ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే స్వంత ఖర్చులతో గుంతలను పూడ్చి పనులు చేయించడం బాగుంది. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేస్తే వాహనదారుల ప్రయాణం సులువు కానుంది.

-ఆటో డ్రైవర్ రాజేశం

ఎమ్మెల్యే కృషి అభినందనీయం



తిమ్మాపూర్ నుంచి అందే వరకు రోడ్డు దుస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్న విషయాన్ని మెదక్ మాజీ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. 2024 ఎమ్మెల్యేగా గెలిచాక అసెంబ్లీలో దుబ్బాక రోడ్ల పరిస్థితిపై ప్రభుత్వానికి విన్నవించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్లు మంజూరు చేసి పనులు చేపట్టడం వెనుక ఎమ్మెల్యే కృషి అభినందనీయం.

- మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి

12 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



గత 12 ఏళ్లకు పైగా తిమ్మాపూర్ నుంచి అందే వరకు రోడ్డు గుంతలమయంగా తయారైంది. ఈ విషయాన్ని మెదక్ మాజీ ఎంపీ ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎంపీగా ఉన్నప్పుడు డబుల్ రోడ్ మంజూరు చేయించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో డబుల్ రోడ్డు నిర్మాణపనులు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గెలిచాక కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే స్వంత డబ్బులతో తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టడం హర్షణీయం. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజల కష్టాలకు 12 ఏళ్ల తర్వాత నిరీక్షణ ఫలించింది. దుబ్బాక ఎమ్మెల్యేకు మా గ్రామస్తుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

-మాజీ సర్పంచ్ కండ్లకొయ్య పర్శరాములు

కోర్టుకు సిబ్బందిని కేటాయిస్తూ జీవో విడుదల

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాలలో కోర్టు ప్రారంభం కావడానికి సంబంధించిన సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం జీవోను జారీ చేసింది. చేర్యాల సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూమి గారి మనోహర్ తెలంగాణ రాష్ట్ర లా సెక్రటరీ చేతుల మీదుగా సిబ్బంది కేటాయింపు జీవో కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ చేర్యాల ప్రజల చిరకాల కోరిక అయిన కోర్టు కేటాయింపు జరగడం హర్షనీయమన్నారు. చేర్యాలలో జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ మ్యాజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు సంబంధించి 27 మంది సిబ్బందిని కేటాయిస్తూ జీవో జారీ చేశారు. ఇందులో జూనియర్ సివిల్ జడ్జి, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్‌తో పాటు ఏడుగురు జూనియర్ అసిస్టెంట్‌లను, ఇద్దరు టైపిస్టులను, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్‌లను, ఒక ఎగ్జామినర్, కాపీస్టును, ముగ్గురు ప్రాసెస్ సర్వర్లను, ఒక రికార్డు అసిస్టెంట్‌ను, ఐదుగురు అటెండర్‌లను నియమిస్తూ జీవో జారీ చేయడం జరిగింది. కోర్టు మంజూరు విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వర్గీయులు ఎవరికివారు తామే కోర్టు రావడానికి ప్రయత్నం చేసి సఫలమయ్యామని చెప్పుకోగా ఎవరి ప్రయత్నమైనా చివరకు చేర్యాల పట్టణ వాసుల కోరిక నెరవేరినట్లు అయింది. కోర్టు, సిబ్బంది కేటాయింపు పట్ల మండలంతో పాటు వివిధ మండలాల ప్రజలు, న్యాయవాదులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించండి

- సీపీఐ (ఎం) మండల కార్యదర్శి సంధిటి రంగారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసి ప్రాజెక్టు నిర్మించిన గత ప్రభుత్వం మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని, వాటిని శాశ్వతంగా పరిష్కరించాలని సీపీఐ (ఎం) గజ్వేల్ మండల కార్యదర్శి సంధింటి రంగారెడ్డి అన్నారు. గజ్వేల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ వద్ద ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించినప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిర్వాసితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం వైకుంఠధామాలు ఎక్కడ లేవన్నారు. కాలనీలో పూర్తిస్థాయిలో రోడ్లు, రక్షిత మంచినీటి పథకాలు పూర్తి కాలేదు అన్నారు. నిర్వాసితులకు చాలామందికి ప్యాకేజీ పూర్తిస్థాయిలో రాలేదని ఆయన అన్నారు. పూర్తిస్థాయిలో ప్యాకేజీ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో శాశ్వత పరిష్కార మార్గం చూడాలని కోరారు.

కలెక్టర్‌గారు న్యాయం చేయండి

నవతెలంగాణ-దుబ్బాక



'కలెక్టర్ గారు తమకు న్యాయం చేయండి' అంటూ లచ్చపేట వార్డుకు చెందిన బాధితుడు బత్తిని సతీష్ కుమార్ గౌడ్ వేడుకుంటున్నాడు. గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట పదో వార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సతీష్ మాట్లాడుతూ, లచ్చపేటలోని సర్వే నంబర్ 26లో తమకు వారసత్వంగా సంక్రమించిన 10 ఎకరాల వ్యవసాయ భూమిని కొందరు కబ్జాదారులు రిజిస్ట్రేషన్, మున్సిపల్ ఆఫీసర్ల సహాయంతో తమ భూమిలో నుంచి 1805 గజాల స్థలాన్ని ఫోర్జరీ, ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి అన్యాయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. తమభూమిలో అంగుళం కూడా ఎవరికీ అమ్మలేదన్నారు. సిరిసిల్లకు చెందిన ఎర్రగుంట భరత్ అనే వ్యక్తి తమకు చెందిన భూమిలో నుంచి 1805 గజాల ఓపెన్ ల్యాండ్‌ను అసెస్మెంట్ కాపీ, రివిజన్ రికార్డులో వారి పేరు లేకున్నా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని అందుకు అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులు సహకరించారని ఆరోపించారు. పలుమార్లు మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ తమ మొరను ఆలకించి తమ భూమిని తమకు ఇప్పించి అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నందాల శ్రీకాంత్, హరీష్, మహేష్ ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు
- ప్రభుత్వం రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాలను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించేంత వరకు ప్రభుత్వంపై ఉద్యమం తప్పదని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మైసగల్ల రాహుల్, తాడూరి భరత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని గత తొమ్మిది ఏండ్లుగా అనేక పోరాటాలు నిర్వహించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వమే కోల్పోయిందన్నారు. అధికారంలో వచ్చిన టువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీలలో భాగంగా అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 11 నెలలైనా ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం డివిజన్ గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించిందని, ఈ ప్రాంత నాయకులు చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా చేయడంలో చిత్తశుద్ధి లేదా అని ప్రశ్నించారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జేఏసీగా ఏర్పడి తొమ్మిది ఏండ్లుగా అనేక పోరాటాలు నిర్వహించి ఇప్పుడు ఉన్నటువంటి కొందరు నాయకులు వారి వ్యక్తిగత స్వార్థ కోసం కాంగ్రెస్ లో ఉంటూ జేఏసీ పేరిట వబ్బం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులను ఐక్యం చేసి ఎస్ఎఫ్ఐగా దశల వారీ పోరాటాలునిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు సంజయ్, అఖిల్, నరేష్, రాజు, విక్రమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరిట అభయ హస్తం హామీలు ఏమైంది..?

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్


నవతెలంగాణ-గజ్వేల్



అంబేద్కర్ పేరిట అభయ హస్తం పెట్టి ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయకపోవడం విచారకరమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. 12 పథకాలు అంబేద్కర్ పేరిట అమలు చేయవలసి ఉందన్నారు. గజ్వేల్ పట్టణంలో గురువారం కుల గణన స్వాగతిద్దాం సామాజిక న్యాయం సాధిద్దాం అని డీబీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం గజ్వేల్ అంబేద్కర్ భవన్‌లో కులగణన పై చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సైతం సమగ్ర కుల గణనకు శ్రీ కారం చుట్టడం విప్లవాత్మకమైన చర్యలకు అడుగులు వేసి తద్వారా సామాజిక న్యాయ సాధనకు బాటలు వేస్తున్నారన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతికుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయ పథకం నేటికి ప్రారంభించలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకాలకు శ్రీకారం చుట్టలేదు.విదేశాల్లో ఉన్నత విద్యకు ఆర్థిక మద్దతు అందించే అంబేద్కర్ విద్యానిధి పథకం అమలు నత్తనడక నడుస్తున్నదన్నారు.దళితుల అభివృద్ధి సంక్షేమానికి మారుపేరైన కాంగ్రెస్ దళితుల అభివృద్ధికి కట్టుబడి వుండాలని కోరారు. ఈ కార్యక్రమం లో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, తిర్మలపూర్ మాజీ సర్పంచ్ బీసీ నాయకులు రాములు, సీనియర్ దళిత నాయకులు బండారు లాలయ్య, జర్నలిస్టు పుట్ట రాజు, గణేష్, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, బీఎస్పీ నాయకులు కనక ప్రసాద్, డీబీఎఫ్ నాయకులు కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

అధిక తూకంతో ముంచుతున్నారని అన్నదాతలు రోడెక్కారు

నవతెలంగాణ-మిరుదొడ్డి



మండలం ఆల్వాల గ్రామంలో రైతులు రాస్తారోకో చేశారు. అధిక తుకం వేసి వ్యాపారులు నట్టేట ముంచుతున్నారని అన్నదాతలు రోడెక్కారు. ఒక్క బస్తా పై ఐదు కేజీల ధాన్యం ఎక్కువ తూకం వేయడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన ఓ ప్రయివేట్ వ్యాపారి రైతుల నుంచి వరి ధాన్యాన్ని 65 కేజీల బస్తాలో 70 కేజీల వరకు ధాన్యం తూకం వేయడం జరిగిందన్నారు. అనుమానం వచ్చిన రైతులు సమీపంలో ఉన్న ధర్మకాంట పై తూకం వేయడంతో, ఒక్కో బస్తా పై ఐదు కేజీల వరకు ఎక్కువ ధాన్యం తూకం వేసినట్లు తేలిందన్నారు. సుమారు 60 బస్తాల్లో క్వింటాల్ 50 కేజీల ధాన్యం అదనంగా తూకం వేయడంపై అన్నదాతలు వ్యాపారితో పాటు హమాలీ కార్మికులపై మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు వేగవంతం చేయకపోవడం వల్లే ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో నిర్వహించిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి రైతులకు నచ్చ చెప్పారు. ఆందోళన విరమించిన రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన కోనమైన మదారి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. గురువారం మాజీ ఎంపీపీ పాండు గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వారితో పాటు మ్యాకల శ్రీనివాస్, బాలస్వామి, నర్సింలు సదుల్లా, తదితరులున్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



రాష్ట్రీయ గ్రామీణ సంస్కృతి మిషన్ (సగర అసోసియేషన్) ద్వారా మార్కా నవీన సురేష్ సాగర్ దంపతుల సౌజన్యంతో ప్రాథమిక పాఠశాల హరిజనవాడ పాములపర్తిలో విద్యార్థులకు బ్యాగులను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి ప్రధానోపాధ్యాయులు లతో సైదా మాట్లాడుతూ దానం దైవంతో సమానం అని నమ్మి పేద విద్యార్థులకు అది మరింతగా ఉపయోగపడుతుందని వెతుక్కుంటూ పల్లె విద్యార్థులకు పట్నం నుంచి విచ్చేసి బ్యాగుల వితరణ చేసిన నవీన సురేష్ సాగర్ దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు బ్యాగులను సద్వినియోగం చేసుకొని విద్యలో ప్రగతి సాధించాలని ,కోరుతూ ఇందుకు సహకరించిన హిందీ ఉపాధ్యాయులు పద్మాదేవీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఉపాధ్యాయులు ప్రత్యూష, తదితరులున్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించిన కమిషనర్



నవతెలంగాణ-సిద్దిపేట

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్‌లు ఇంటింటికీ స్టికర్‌ల అతికించే ప్రక్రియ, కుటుంబ వివరాల సేకరణను 34, 35 వార్డుల్లో కమిషనర్ అశ్రిత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ ుతూ తమ గృహాల వద్దకు వచ్చే ఎన్యుమరె టర్‌లకు పట్టణ ప్రజలు సైతం సహకరించాల న్నారు. సంబంధిత పెద్దలు లేదా ఎవరు అందుబాటులో ఉంటే వారు ఇంటి సభ్యులకు సంబంధించిన వివరాలను తెలియపర చాలన్నారు. సర్వే చేసే ప్రతి 10 మంది ఎన్యుమరెటర్‌లకు ఒక సూపర్ వైజర్ ఉన్నారని, వారు ఎన్యుమరెటర్‌లకు సందేహాలు నివృత్తి పరుచుటకు సహాయానికి అందుబాటులో ఉంటూ వారు సైతం సర్వేను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయుటకు కృషి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుడాల సంధ్య శ్రీకాంత్, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సర్ సీవీ. రామన్ జయంతి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని సర్ సీవీ.రామన్ ఉన్నత పాఠశాలలో ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త సర్ సీవీ.రామన్ జయంతిని గురువారం పాఠశాల ప్రధానో పాధ్యాయులు కాయిత నారాయణ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిశోధన ద్వారా ప్రఖ్యాత నోబెల్ బహుమతిని పొంది భౌతిక శాస్త్రంలో ఆసియా ఖండంలోనే మొదటి నోబెల్ బహుమతి పొందిన వ్యక్తి సర్ సీవీ రామన్ అన్నారు. భారతదేశ పేరు ప్రఖ్యాతలను ప్రపంచ దేశాల్లో ఇనుమడింపజేసేల చేశారని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ప్రఖ్యాత శాస్త్రవేత్తలుగా ఎదిగి మన మాతృభూమికి గొప్ప పేరు తీసుకురావాలని తెలిపారు.

అక్కారంలో సమగ్ర సర్వే మొదలు



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం అయ్య యింది. గురువారం గజ్వేల్ మండలం అక్కారంలో ఇంటింటి సర్వే మొదలైంది. గ్రామంలో ఇంటిం టికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం విధి విధానాలను అధికారులు అమలు చేస్తున్న తీరు కనిపించింది. ప్రతి ఒక్కరి పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు యాదగిరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం మిరుదొడ్డికి చెందిన కనకరాజు(40) మిరుదొడ్డి నుంచి అల్వాల కి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మిరుదొడ్డి శివారులో వాహనం అదుపుతప్పి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పరశురాం తెలిపారు.


లారీ ఢీకొని మహిళా కూలీకి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక శివారులో గురువారం సాయంత్రం లారీ ఢీ కొట్టిన సంఘటనలో మహిళా కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే సిరిసినగండ్ల గ్రామానికి చెందిన రేణుక వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి తిరిగి గ్రామానికి వెళుండగా అజాగ్రత్తగా అతివేగంగా కొండపాక వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బరుపేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన సొల్లు రేణుక రూ.16వేలు, కూడవెల్లి గ్రామానికి చెందిన ముత్తయ్యకి రూ.15వేల సీఎంఆర్ఎఫ్ మంజూరైన చెక్కులను గురువారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా సీఎంఆర్ఎఫ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, రాజు, పర్శరాములు ఉన్నారు.


ఎల్ఓసీని అందించిన ఎంపీకి కృతజ్ఞతలు



నవతెలంగాణ-తొగుట

ఎల్ఓసీ అందించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు కృతజ్ఞతలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి అన్నారు. గురువా రం గుడికందుల గ్రామా నికి చెందిన ఉరుమడ్ల ఎల్లారెడ్డి గత కొంతకాలంగా అనారో గ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న విభీషణ్ రెడ్డి ఎంపీ దృష్టికి తీసుకెళ్ళాడు. వెంటనే స్పందించి ఎంపీ బాధితుని చికిత్స నిమిత్తం నిమ్స్ హాస్పిటల్ యాజమాన్యానికి రూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కును బాధితుని కుమారునికి అందజేసారు. ఆపద అనగానే ముందుండి అన్ని విధాలుగా ఎంపీసహకరిస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

హామీలకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కట్టుబడి పనిచేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీ గ్యాస్ రూ.500లకే, ఇందిరమ్మ ఇల్లు కూడా అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుంది.

సామాజిక సర్వే అందరికీ ఉపయోగం

-కాంగ్రెస్ గజ్వేల్ నాయకులు సారిక శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ఆర్థిక, సామాజిక సర్వే అందరికీ ఉపయోగపడుతుందని కాంగ్రెస్ గజ్వేల్ సీనియర్ నాయకులు సారిక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనతో ప్రతి కుటుంబం సంబంధించిన ఆర్థిక సామాజిక సమస్యలు బయటకు వస్తాయని దీని ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని అన్నారు. సర్వే విజయవంతంగా ఈ నెల 30 వరకు నిర్వహిస్తానన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు సర్వేకు సహకరించాలని వారి విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా సామాజికంగా అనేక కుటుంబాలు వెనుక పడ్డాయని ఈ సర్వే ద్వారా ప్రభుత్వం ఆదుకునేందుకు వీలు ఉంటుందన్నారు.

సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

-మండల మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఈదుల్



నవతెలంగాణ-మిరుదొడ్డి

సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని మిరుదొడ్డి మండలం మైనార్టీ ప్రెసిడెంట్ మహమ్మద్ ఈదుల్ (గుట్టల్)అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు సమగ్ర సర్వేకు సహకరించాలని, రాష్ట్రంలో ఉన్నత స్థాయిని పెంచుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్వేను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే మూలంగా కుల గణనతో ఆస్తి బాధ్యతలు, అనేక రకాలుగా సర్వే అందరికీ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ప్రజా, రైతు, కార్మిక సమస్యలే సీపీఐ(ఎం) ఎజెండా

- భవిష్యత్తులో ఎర్రజెండా పార్టీలదే రాజ్యాధికారం
- దుబ్బాకలో ఘనంగా సీపీఐ(ఎం) నాలుగో మండల మహాసభలు



నవతెలంగాణ-దుబ్బాక

ప్రజా, రైతు, కార్మిక సమస్యలే సీపీఐ(ఎం) ఎజెండా అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, కూలీల వ్యతిరేక విధానాలపై అనునిత్యం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమేనని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇండియాలో ఎర్ర జెండా పార్టీలే రాజ్యాధికారం చేపడతాయని నొక్కి చెప్పారు. దుబ్బాక పట్టణ కేంద్రంలోని "పట్టణ స్వర్ణకారుల భవనం"లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) సీపీఐ(ఎం) "దుబ్బాక మండల 4వ మహాసభ" లకు జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ముందుగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అమరుల త్యాగాలను కీర్తిస్తూ పాట పాడగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకు న్నారు. ఆ తర్వాత ఇటీవలే మరణించిన పార్టీ నాయకులకు 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 26 మండలాల్లో ఈ మహాసభలను ఈ నెలాఖరులోగా జరుపుతామని తెలిపారు. అలాగే డిసెంబర్ 1, 2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు హాజరవుతున్నట్లు వెల్లడించారు. దుబ్బాక పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి జిల్లా మహాసభలకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దుబ్బాక ప్రాంతంలో గత మూడేళ్లగా రైతులు, హమాలీ,పేద ప్రజలు, బీడీ కార్మికుల సమస్యల్ని సీపీఐ(ఎం) పరిష్కరించిం దన్నారు. ఈ మూడేళ్ల పని తీరును సమీక్షించుకుని రాబోవు రోజుల్లో చేయాల్సిన కర్తవ్యాలు, విధివిధా నాలపై సమాలోచనలు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో దుబ్బాక ప్రాంతంలోని ప్రతి గ్రామాన సీపీఐ(ఎం)ని విస్తరింప చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దుబ్బాక ప్రాంతంలో బీడీ కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సంఘటిత, అసంఘటిత, బిల్డింగ్ వర్కర్ల శ్రేయస్సుకోసం పోరాడిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమేనని నొక్కి చెప్పారు. భవిష్యత్తు పోరాటాలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ మాట్లాడు తూ సీపీఐ(ఎం) 4వ మండల మహాసభలను దుబ్బాకలో విజయవంతంగా నిర్వహించుకోవడం సంతోషకం మన్నారు. దుబ్బాక ప్రాంతంలో ప్రజా, కార్మిక,రైతు, హమాలి, బీడి కార్మికుల సమస్యలే ఎజెండాగా పనిచేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ(ఎం) అని స్పష్టం చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితుల పట్ల కొట్లాడింది. బీడి కార్మికులకు జీవన భృతి ఇప్పించింది సీపీఐ(ఎం) మాత్రమే అని గుర్తు చేశారు. ఈ మహాసభలలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, సింగిరెడ్డి నవీన, మండల నాయకులు కొంపెల్లి భాస్కర్, మల్లేశం, లక్ష్మీనర్సయ్య, సాదిక్, రాజు, సాజిద్, రమేష్, ప్రశాంత్, మహేష్, వాని, భాగ్యమ్మ, సత్యమ్మ, పలు గ్రామాల పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

నేడు 37వ వార్డులో సీఎం జన్మదిన వేడుకలు

-వార్డు కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మీ ఆనంద్


నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా 37వ వార్డులో పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ కార్మికులకు, వార్డు మహిళలకు బట్టల పంపిణీ, భోజనం ఏర్పాటు చేసినట్లు 37వవార్డు కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మీ ఆనంద్‌లు తెలిపారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ, జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం, కౌన్సిలర్లు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం కూడలి నుండి మధ్యాహ్నం రెండు గంటలకు ర్యాలీతో కార్యాస్థలానికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మొదటిసారి రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నందుకు ఆనంద్‌కు అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, కౌన్సిలర్ రియాజ్, ఎల్లం, నాయకులు గయాజుద్దీన్, అనిల్, రాకేష్, బాలు, అజ్జు తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి టాలెంట్ టెస్టు





నవతెలంగాణ-సిద్దిపేట


పట్టణంలోని కాకతీయ టెక్నో హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో గురువారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కమిటీ మెంబర్ ములుగు బాలరాజ్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి ఉపాధ్యాయ బృందం ప్రశ్న పత్రాలను విడుదల చేసి, పాఠశాల స్థాయిలో పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచడానికి, మూఢనమ్మకాలను నిర్మూలించడానికి, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ జన విజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని అన్నారు. దాదాపు 24వేల మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రవేత్తల చరిత్రను తెలుసుకొని, వారి అడుగుజాడల్లో పయాణించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష సహకారంతో 8వ, 9వ, 10వ, తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గజ్వేల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పాఠశాల స్థాయి చెకుముకి ప్రశ్నపత్రాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. తరగతికి ఒకరి చొప్పున ప్రథమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నవంబర్ 21న మండల స్థాయి టాలెంట్‌కు హాజరు కావలసి ఉంటుంది. పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సహకరించిన ప్రభుత్వ అధికారులకు, ప్రభుత్వ ప్రయివేటు, గురుకుల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా గౌరవ అధ్యక్షులు వి.నర్సింలు అభినందనలు తెలిపారు. ప్రశ్నపత్రాల విడుదల్లో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ , దయానందం, హఫీజ్ జ్యోతి పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని పోసి ప్రమాదాలకు కారణం కావొద్దు

- గజ్వేల్ సీఐ బి.సైదా



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల ప్రమాదాలకు కారణం కావద్దని గజ్వేల్ సీఐ బి.సైదా అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ రాత్రి సమయాల్లో అది గమనించక ప్రమాదం జరిగి మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద, ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్ల పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుందని గుర్తు చేశారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రైతు వెంటనే రోడ్లపై పోసి ఉన్న ధాన్యాన్ని ఖాళీ చేయాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానాధికారికి శుభాకాంక్షలు తెలిపిన టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా ఖజానాధికారిగా ఇటీవల అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎం. చంద్రు నాయక్‌ను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ గత నెల సిద్దిపేట జిల్లాలో 256 మంది సాధారణ ఉపాధ్యాయులు, 20 మందికి పైగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు నియామకమయ్యారని, వారికి ఎంప్లాయ్ ఐడీని, ప్రాన్ నెంబర్లను త్వరితగతిన కేటాయించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు వచ్చిన అప్లికేషన్లు అన్నిటికి ఐడి నెంబర్ కేటాయించడం జరిగిందని డీటీఓ తెలియజేశారని తెలిపారు. ప్రాన్ అప్లికేషన్లు వచ్చిన వెంబడే నెంబర్లు కేటాయిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఓ సిహెచ్. నరసింహులు, టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గ్యార ప్రవీణ్ కుమార్, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కో కన్వీనర్ ఎం శివుడు, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభకు హాజరైన వక్తలు

- కొల్గూర్‌లో సభకు హాజరైన ప్రముఖులు



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

ప్రజాపక్షపాతి మల్లం రాజు నిజాయితీగా, నిష్పక్షపాతంగా ప్రజా పక్షపాతిగా జీవితాంతం నిలిచాడని పలువురు వక్తలు అన్నారు. గురువారం కొల్గూర్ తాజా మాజీ సర్పంచ్ మల్లం రాజు సంస్మరణ సభ నిర్వహించారు. మల్లం రాజన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వెసి నివాళులు అర్పించారు. ప్రజాకళాకారుడు చికొడ్ నర్సన్న మల్లం రాజు పై రాసిన పాటల సిడిని రాజన్న తల్లి కమలమ్మ, సతీమణి సుమతమ్మలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజు మృతి కుటుంబానికి, గ్రామానికి తీరని లొటన్నారు. గజ్వేల్ మండలంలోని ఎంపీపీగా పలు అభివృద్ధి పనులు చేసాడని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమానికి సానుబూతి పరుడిగా సహయకారిగా నిలిచారన్నారు.గ్రామ అభివృద్ధి కి రాజీపడకుండా పని చెశారన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి బాస్కర్, మాజీ ఎంపీపీ నాయిని యాదగిరి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నాయకులు వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, కొన్నెరాజిరెడ్డి, విరసత్ అలి, మదాసు శ్రీ నివాస్, రాచకొండ వెంకన్న డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, పుట్ట రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన గజ్వేల్ అభివృద్ధి

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పది ఏండ్లు అభివృద్ధిలో పరుగులు తీసిన గజ్వేల్ నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి ఆటకెక్కిందని బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం స్థానిక కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. స్వయ ప్రయోజనాల కోసం తిరుగుతు న్నారు తప్ప గజ్వేల్ అభివృద్ధి విషయంలో చర్చించడం లేదన్నారు. గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయని వాటికి నిధులు కేటయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజక వర్గంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎన్ని సార్లు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జకీర్, మండల అధ్యక్షులు మధు, పట్టణ అధ్యక్షులు నవాజ్ మేరా తదితరులు పాల్గొన్నారు.

ఆవాలతో ముఖ్యమంత్రి అద్భుత చిత్రం



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు భక్తిరత్న, రామకోటి రామరాజు రేవంత్ చిత్రాన్ని ఆవాలతో అత్యంత అద్భుతంగా చిత్రించి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ కు ఆ చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి చిత్రం చిత్రించి ఆయన కళ ఎంత గొప్పదో తెలియజేశారు. ఇలాంటి కళాకారులు మన గ్రామంలో ఉండడం మన అదృష్టం అన్నారు. సామాజికంగా, ధార్మికంగా ముందుండి ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించిన రామకోటి రామరాజుని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మరెన్నో కళలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. నక్క రాములు, సాధక్ పాషా, స్వామి, కొడకండ్ల బాలు, అహ్మదీపూర్ బాలు, దప్పు గణేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పక్కదోవ కోసమే సర్వే



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజలు సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని భావించిన ప్రభుత్వం ప్రజలను పక్కదోవ పట్టించేందుకు సర్వేన ముందుకు తీసుకొచ్చిన బీజేపీ గజ్వేల్ మండలం ఉపాధ్యక్షులు బారు అరవిందు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదికి వస్తుందని ఏ పథకం కూడా పూర్తిస్థా యిలో అమలు కాలేదని అన్నారు. గజ్వేల్ మం డలంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అంద డం లేదని పేర్కొన్నారు. గజ్వేల్ మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్క రించాల ని డిమాండ్ చేశారు.

భర్తీకాని నామినేటెడ్ పదవులు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో మిగిలిపోయిన నామినేటెడ్ పదవుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలోనే వాటిని కూడా భర్తీ చేస్తామని బహిరంగ సభ సాక్షిగా చెప్పి వెళ్లారు. దీంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు వాటికోసం ఎదురుచూస్తున్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం సైతం పూర్తి అయింది. మిగతా నామినేటెడ్ పదవులు భర్తీ కోసం గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి నర్సారెడ్డి ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. కొండ పోచమ్మ, నాచారం ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్, కొండపాక, ఒంటిమామిడి మార్కెట్ కమిటీల చైర్మెన్ పదవులకు భర్తీ కావలసి ఉంది. ఈ పదవుల కోసం నాయకులు కూడా దాదాపు ఖరారై సిద్ధంగా ఉన్నారు. అధికార ప్రకటన రావాల్సిన మాత్రమే ఉంది. ఆశిస్తున్న నేతలు చాలామంది ఉన్నప్పటికీ నర్సారెడ్డి నాయకత్వంలో బుజ్జగింపులు చేపడుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో నాయకుల మధ్య కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ పార్టీ అధిష్టానం దృష్టి పెట్టింది. అయితే నిర్ణయాలు ఏం తీసుకుంటుందో తెలియటం లేదు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు మల్లారెడ్డి, మరికొందరు నాయకులు కార్యకర్తలు పార్టీకి కొంత దూరంగా ఉంటు న్నారు. పార్టీ అధిష్టానం మాత్రం నియోజకవర్గ ఇన్చార్జి నర్సారెడ్డి నాయకత్వం లో నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులు కానీ నామినేటెడ్ పదవుల భర్తీ జరుగు తుందని కరాకండిగా అధిష్టానం ప్రకటిం చింది. నియోజక వర్గం లోని ఒంటిమా మిడి మార్కెట్ కమిటీ చైర్మెన్ స్థానం దళితమహిళకు కేటా యించగా, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి పురుషులకు కేటాయిం చారు. అదేవిధంగా నాచారం టెంపుల్ చైర్మెన్ సీనియర్ నాయకులు మోహన్ గుప్తకు దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కొండపోచమ్మ దేవస్థానం చైర్మెన్ పదవి ఇద్దరి మధ్య పోటీ ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న ఒకరి పేరును నర్సారెడ్డి ఖరారు చేసి సిద్ధంగా ఉంచినట్లు పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. అదేవిధంగా గజ్వేల్ డివిజన్ సంబంధించిన ఆత్మ కమిటీ చైర్మెన్ పదవి ఎవరికి దక్కుతుంది అనేది తెలియవలసి ఉంది. ఈ పదవి కూడా ఎవరికి కట్టబెట్టాలో ఇప్పటికే నర్సారెడ్డి నిర్ణయించినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం లో నేతల మధ్య విభేదాలు ఉండగా వాటిని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకుపోగా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వినికిడి. నాయకులు మాత్రం తన అభిప్రాయాన్ని పూర్తిగా చెప్పలేదని తెలుస్తుంది. గజ్వేల్ నియోజకవర్గ నాయకత్వం త్వరగా నిర్ణయం తీసుకొని మిగతా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నేతల మధ్య మనస్పర్థలు తగ్గే అవకాశం ఉంటుంది.

-మున్సిపల్ , సర్పంచ్ ఎన్నికల నాటికి ఏకతాటిపైకి తీసుకురావాలి

గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో ఉన్న నాయకుల మధ్య విభేదాలు లేకుండా మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల నాటికి పూర్తిగా ఒకతాటిపైకి తీసుకురావాలి. పార్టీలో ఇదే ధోరణిలో కొనసాగితే పట్టణ ప్రాంతాల్లో కొంత ప్రభావం పడే అవకాశం ఉంటుంది. గజ్వేల్ నియోజకవర్గంలో రెండు మున్సిపల్‌లు ఉన్నాయి. తూప్రాన్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లు ఉండగా 9 మండల పరిషత్, జెడ్పీటీ స్థానాలు నియోజకవర్గంలో ఉన్నాయి. దాదాపు అన్ని మండలాల్లో నేతల మధ్య కొంత దూరం ఏర్పడ్డది. ఆ సమస్యను సర్ది చేసి నర్సారెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకుపోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.